Follow: @ANNTELUGU
29-03-2025
ANN తెలుగు
# మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 117 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్

## యాంకర్ విష్ణుప్రియకు హైకోర్టులో షాక్

- కేసు కొట్టేయడం కుదరదు
- దర్యాప్తునకు సహకరించాలన్న హైకోర్టు

08



## మళ్ళీ స్టాలినే..

- తమిళ ప్రజల మొగ్గు అటే
- సర్వేలన్నీ స్టాలిన్ వైపే

02



## ఉగాది తర్వాత ఏఐ సిటీకి భూమిపూజ

- ఫ్యూచర్ సిటీ మహేశ్వరంలోనే నిర్మాణం
- మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

02





## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే

### త్వరలో కాంగ్రెస్‌లోకి కొత్త ప్రభాకర్ రెడ్డి?

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ నేత, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిశారు. ఈ సందర్భంగా తన నియోజకవర్గమైన దుబ్బాకలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ని ఏర్పాటు చేయాలని సీఎంను బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోరారు. దీనిపై రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. మిగతా 2లో



## పాలమూరు-రంగారెడ్డికి కేంద్రం షాక్

- ఆ ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కల్పించలేం
- తేల్చిచెప్పిన కేంద్ర ప్రభుత్వం

**ఢిల్లీ, మహా:** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జాతీయ ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం వెనక్కు పంపింది. కృష్ణా నదీ జలాల వినియోగంపై రెండు రాష్ట్రాల మధ్య ప్రస్తుత వివాదం సుప్రీంకోర్టులో ఉందని కేంద్ర ప్రభుత్వం మిగతా 2లో



### మహా భూకంపం

మయన్మార్‌లో వచ్చిన భూకంపం అత్యంత శక్తిమంతమైందని అమెరికా జాతీయ భూకంప సమాచార కేంద్రంలోని భూభౌతిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రెండేళ్ల క్రితం ఇటువంటిదే తుర్కియే, సిరియాలో సంభవించడంతో భారీగా ప్రాణనష్టం చోటు చేసుకొంది. ముఖ్యంగా మయన్మార్, థాయ్‌లాండ్ జనసాంద్రత అత్యధికంగా ఉన్న ప్రదేశాలు కావడంతో వీటిని రెడ్ ఈవెంట్లుగా వ్యవహరిస్తామని వెల్లడించారు. రెండేళ్ల క్రితం 7.8 తీవ్రతతో తుర్కియే, సిరియాలో భూకంపం సంభవించడంతో 53 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. అదే విధంగా ఇక్కడ కూడా భారీగా ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని అమెరికా భూభౌతిక సర్వే సంస్థ పేర్కొంది.

# భారీ ప్రాణనష్టం?

## శిథిలాల్లో వేలమంది.. బ్యాంకాక్‌లో ఒకే భవనంలో 320 మంది

### నాడు సిరియా భూకంపంలో 53 వేల మంది మృతి

ఈ భూకంపం కూడా అత్యంత శక్తివంతమైనదంటున్న అమెరికా భూభౌతిక శాస్త్రవేత్తలు

**మహా:** ప్రపంచంలో అత్యధిక భూకంపాలు వచ్చేందుకు అవకాశం ఉన్న ప్రదేశాల్లో మయన్మార్ ఒకటి. ఇండియన్ టెక్టానిక్ ప్లేట్, బర్మా మైక్రోప్లేట్‌కు మధ్య దాదాపు 1200 కిలోమీటర్ల ప్రదేశం ఇక్కడ ఉంది. చాలా సార్లు ఇక్కడ భూకంపాలు వచ్చిన చరిత్ర ఉంది. గత వందేళ్లలో మయన్మార్‌లో 6 తీవ్రత కంటే ఎక్కువగా 14 భూకంపాలు నమోదయ్యాయని బ్రిటిష్ జియోలాజికల్ సర్వే శాస్త్రవేత్త బ్రియాన్ బాప్టి వెల్లడించారు. శుక్రవారం ఒక్క రోజే ఆరు భూకంపాలు నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. అతి తీవ్రమైంది 7.7గా నమోదకాగా.. అత్యల్పమైంది 4.3గా ఉంది.



### భవనాలు, రోడ్లకు పగుళ్లు..

థాయ్‌లాండ్‌లో చాలా భవనాలకు పగుళ్లు ఏర్పడటంతో ఉద్యోగులు, ప్రజలు వాటిల్లోకి వెళ్లేందుకు భయపడుతున్నారు. దీంతో ప్రజలు ఇంకా వీధుల్లోనే ఉన్నారు. బ్యాంకాక్‌లో భారీ భవనం కూలిపోయే సమయానికి దానిలో 320 మంది పనివారు ఉన్నట్లు తెలుస్తోంది. ఇక మయన్మార్ రాజధాని నేపిడా వద్ద ప్రధాన రహదారులు భూకంపం తీవ్రతకు చీలిపోయాయి. దేశంలోని రెండో అతిపెద్ద నగరమైన మాండలే ప్రాంతంలో ప్రాణనష్టం అధికంగా ఉండొచ్చన్న ఆందోళన వ్యక్తమైంది. అక్కడ పలు భవనాలు కుప్పకూలిన ఫొటోలు బయటకు వచ్చాయి. ఈ నగరం భూకంప కేంద్రానికి అతి దగ్గరగా ఉన్న ప్రదేశాల్లో ఒకటని అమెరికా జియోలాజికల్ సర్వే విభాగం పేర్కొంది. పైగా ఈసారి పది కిలోమీటర్ల లోతులోనే భూకంప కేంద్రం ఉండటంతో దాని తీవ్రత అత్యధికంగా కనిపించింది.

## ఉగాది వేళ తెలంగాణ సర్కారు కానుక

### ముఖ్యమంత్రి రేవంత్ చేతులమీదుగా సన్నబియ్యం పథకం ప్రారంభం

- ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం కోసం రూ. 10,665 కోట్లు ఖర్చు
- మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్ వెల్లడి



**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా హుజూర్‌నగర్‌నుంచి ఉగాది పండుగ రోజే ప్రారంభించిస్తున్నట్ల రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మిగతా 2లో



## కరాటే నా జీవితంలో భాగం

### టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

ముఖ్యమంత్రి క్రీడలకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారు

కరాటేతో ఉత్సాహపరిచిన స్పీకర్, మంత్రి పొన్నం

**హైదరాబాద్, మహా:** కరాటే తన జీవితంలో ఒక భాగమని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగుతోన్న 4వ కియో నేషనల్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలకు మహేశ్ కుమార్ గౌడ్, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ,మంత్రి పొన్నం ప్రభాకర్ లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్.. సీఎం రేవంత్ రెడ్డి స్పోర్ట్స్ పై ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. మార్చి 26 నుంచి 4వ కియో నేషన్ కరాటే చాంపియన్ షిప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్ని రాష్టాల నుండి క్రీడాకారులు పాల్గొంటున్నారని చెప్పారు. ఏ స్పోర్ట్స్ అయినా నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దేశంలో చాలా మంది కరాటే క్రీడాకారులున్నారని చెప్పారు టీ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్. 2030 ఒలింపిక్స్ కోసం క్రీడాకారులు ఎదగాలన్నారు. దాని కోసం తెలంగాణ క్రీడాకారులు సిద్ధం కావాలని సూచించారు. రానున్న రోజుల్లో హైదరాబాద్ నగరంలో ఏషియన్ కరాటే పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ బడ్జెట్ లో స్పోర్ట్స్ రంగానికి రూ. 465 కోట్లు కేటాయించడం సంతోషకరమని మహేశ్ గౌడ్ అన్నారు . కొన్ని గొప్ప గొప్ప స్కూల్స్ లో ప్లే గ్రౌండ్స్ లేకుండా ఉన్నాయని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు.

## ఈ సెషన్స్ రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతాయి

- బీసీ బిల్లు పెట్టడం, ఎస్సీవర్గీకరణ చేయడం చరిత్ర
- బడ్జెట్ సమావేశాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత



02

## ఈసారి అసెంబ్లీ బాగా జరిగింది

- అందరికీ అవకాశం లభించింది
- గతంలో మాట్లాడేవారిని.. మార్షల్స్ తో పంపేవారు
- సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని



02



# మోస్ట్ పవర్ ఫుల్ రేవంత్

## ఏడాదిలో 11స్థానాలు ఎగబాకిన సీఎం

ఇండియన్ ఎక్స్ ప్రెస్ టాప్-100 జాబితాలో రేవంత్

సామాన్యుల నేత.. న్యాయం కోసం ఎవరినైనా ఎదిరించే డేరింగ్ లీడర్

సీఎం రేవంత్ కు 28వ ర్యాంకు.. టాప్-100లో చోటు దక్కని కేసీఆర్, కేటీఆర్, కిషన్ రెడ్డి

సౌత్ సీఎంలలో బాబుకు 14, సిద్ధరామయ్యకు 20, స్టాలిన్ కు 23, విజయన్ కు 41వ ర్యాంకు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇండియాలోని పవర్ ఫుల్ లీడర్ల జాబితాలో పైపైకి ఎగబాకుతున్నారు. గత ఏడాది కన్నా తన ర్యాంకును మెరుగుపరుచుకుని.. ఏడాదికాలంగా మరింత శక్తివంతంగా మారాడు. ముక్కుసూటిగా, ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడడం.. దేనికీ లొంగకపోవడం, సామాన్యుల కోసం ఎవరినైనా ఎదిరించడం వంటి డేరింగ్ డాషింగ్ లక్షణాలే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇండియాలోని మోస్ట్ పవర్ ఫుల్ లీడర్లలో 28వ ర్యాంకులో నిలిపాయి. గత ఏడాది 39వ ర్యాంకులో నిలిచిన సీఎం రేవంత్.. ఏడాదిలో మరింతగా ప్రభావం చూపిన నేతగా దేశం భావిస్తోంది. గతేడాది 39వ స్థానంలో ఉన్న సీఎం ఈసారి పదకొండు స్థానాలు మెరుగుపడి 28వ స్థానం దక్కించుకున్నారు. 2021లో టీపీసీసీ చీఫ్‌గా నియమితులైన తర్వాత పార్టీలో అసంతృప్తిని ఎదుర్కోవడంతోపాటు వర్గపోరుతో కూడిన కాంగ్రెస్ పార్టీని 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అద్భుతంగా విజయంవైపు నడిపించారని ఈ నివేదిక పేర్కొన్నది.

- మహా, హైదరాబాద్,

02



# మోస్ట్ పవర్ ఫుల్ రేవంత్

## ఏడాదిలో 11స్థానాలు ఎగబాకిన సీఎం

**ఇండియన్ ఎక్స్ ప్రెస్ టాప్-100 జాబితాలో రేవంత్**

**సామాన్యుల నేత.. న్యాయం కోసం ఎవరినైనా ఎదిరించే డేరింగ్ లీడర్**

**సీఎం రేవంత్ కు 28వ ర్యాంకు.. టాప్-100లో చోటు దక్కని కేసీఆర్, కేటీఆర్, కిషన్ రెడ్డి**

**సౌత్ సీఎంలలో బాబుకు 14, సిద్దరామయ్యకు 20, స్టాలిన్ కు 23, విజయన్ కు 41వ ర్యాంకు**

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇండియాలోని పవర్ ఫుల్ లీడర్ల జాబితాలో పైపైకి ఎగబాకుతున్నారు. గత ఏడాది కన్నా తన ర్యాంకును మెరుగుపరుచుకుని.. ఏడాదికాలంగా మరింత శక్తివంతంగా మారాడు. ముక్కుసూటిగా, ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడడం.. దేనికీ లొంగకపోవడం, సామాన్యుల కోసం ఎవరినైనా ఎదిరించడం వంటి డేరింగ్ డాషింగ్ లక్షణాలే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇండియాలోని మోస్ట్ పవర్ ఫుల్ లీడర్లలో 28వ ర్యాంకులో నిలిపాయి. గత ఏడాది 39వ ర్యాంకులో నిలిచిన సీఎం రేవంత్.. ఏడాదిలో మరింతగా ప్రభావం చూపిన నేతగా దేశం భావిస్తోంది. గతేడాది 39వ స్థానంలో ఉన్న సీఎం ఈసారి పదకొండు స్థానాలు మెరుగుపడి 28వ స్థానం దక్కించుకున్నారు. 2021లో టీపీసీసీ చీఫ్‌గా నియమితులైన తర్వాత పార్టీలో అసంతృప్తిని ఎదుర్కోవడంతోపాటు వర్గపోరుతో కూడిన కాంగ్రెస్ పార్టీని 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అద్భుతంగా విజయంవైపు నడిపించారని ఈ నివేదిక పేర్కొన్నది. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్‌ను ఓడించి ఆ పార్టీకి షాకిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో రేవంత్‌రెడ్డి బయటివ్యక్తి అని కనిపించినప్పటికీ ఆ విమర్శలన్నింటినీ దాటుకుని పార్టీని విజయతీరంవైపు నడిపినట్లు ఈ రిపోర్టు తెలిపింది. ఆరు గ్యారెంటీల హామీ అమలు ఆయన ముందున్న ప్రధానమైన సవాలు అని స్పష్టం చేసింది. అలాగే యాక్టివ్ అవుతున్న బీజేపీని ఎదుర్కోవడం ఆయనకు సవాలు అని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తన పార్టీని గెలిపించుకోవాల్సి ఉందని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఫైర్ బ్రాండ్ ప్రసంగాలకు పేరుగాంచిన సీఎం రేవంత్ రెడ్డి చెన్నైలో డీలిమిటేషన్ సమావేశానికి హాజరుకావడంతో పాటు ఆ తీర్మానాలను ముందుకు తీసుకుపోవడంలో దూకుడుగా ఉన్నట్లు నివేదిక పేర్కొంది.

### కేసీఆర్ లేని జాబితా...

మోస్ట్ పవర్ ఫుల్ లీడర్ల జాబితాలో తెలంగాణ, ఏపీ తాజా మాజీ సీఎంలు కేసీఆర్), జగన్‌కు చోటు దక్కలేదు. అలాగే కేటీఆర్, లోకేశ్ లకు కూడా స్థానం దక్కలేదు బిహార్‌లో అధికారంలో లేకపోయినా ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ 86, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్‌కు 87వ స్థానాలు దక్కాయి. ఇటీవల ఢిల్లీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన రేఖా గుప్తా ఈ జాబితాలో 65వ ర్యాంక్‌లో నిలిచారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ 89వ ర్యాంకులో నిలిచారు. టాలీవుడ్ యాక్టర్ అల్లు అర్జున్ జాబితాలో 92వ స్థానంలో నిలిచారు. టాలీవుడ్ నుంచి మిగతావారెవరికి స్థానం దక్కలేదు. క్రికెటర్లలో రోహిత్ శర్మ 48, విరాట్ కోహ్లీకి 72, బుమ్రా 83 స్థానం దక్కించుకున్నారు. అలియా బట్ 100 ర్యాంక్‌లో ఈ జాబితాలో ఆఖరిలో నిలిచారు. వీరితోపాటు 10, 11వ స్థానాల్లో ముకేశ్ అంబానీ, గౌతం అదానీలు నిలిచారు. చెస్ విశ్వనాథ్, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నాతో పాటు తదితరులు జాబితాలో చోటు దక్కించుకున్నారు.

### టాప్ టెన్ లో రాహుల్ గాంధీ

లోక్ సభలో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు స్వీకరించడంతో పాటు ప్రధాని మోదీని ధీటుగా ఎదుర్కొంటున్న నేతగా రాహుల్ ను ప్రజలు భావిస్తున్నారు. గత ఏడాది 16వ ర్యాంకులో ఉన్న రాహుల్ ఈ ఏడాది ప్రజాదరణ పెంచుకుని 9వ ర్యాంకుకు ఎగబాకారు. , కర్నాటక సిఎం సిద్దరామయ్య 22 నుండి 20వ ర్యాంకుకు , తమిళనాడు సీఎం స్టాలిన్ 25 నుండి 23వ ర్యాంకుకు మెరుగుపడ్డారు. కేరళ సీఎం పినరయివిజయన్ 49వ ర్యాంకు నుండి 41వ ర్యాంకు సాధించారు. ఇక గత జాబితాలో చోటులేని చంద్రబాబు ఇపుడు ఏకంగా 14వ ర్యాంకు సాధించాడు.

# ఉగాది వేళ తెలంగాణ సర్కారు కానుక

## ముఖ్యమంత్రి రేవంత్ చేతులమీదుగా సన్నబియ్యం పథకం ప్రారంభం

### ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం కోసం రూ. 10,665 కోట్లు ఖర్చు.. మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్ వెల్లడి

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర చరిత్రలోనే పేదల జీవితాల్లో విప్లవాత్మక మార్పు రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం సెక్రటేరియట్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పంపిణీ చేసే రేషన్ బియ్యం చాలా మంది లబ్ధిదారులు ఉపయోగించుకోవడం లేదని, దొడ్డు బియ్యం కావడంతో డీలర్ల నుంచి బ్లాక్‌లో అక్కడక్కడా అమ్మకాలు చేయడం జరుగుతుంది. ఏటా రూ. 7వేల కోట్ల నుంచి రూ. 8వేల కోట్ల విలువైన బియ్యం దుర్వినియోగం అవుతుందన్నారు. తెలంగాణలో దాదాపు 3.10 కోట్ల మంది ప్రయోజనం పొందాలనే లక్ష్యంతో రాష్ట్ర జనాభాలో 85 శాతం మందికి ప్రయోజనం ఉంటుందన్నారు. అర్హత ఉన్న ప్రతి వ్యక్తికి నెలకు 6 కిలోల సన్న బియ్య అందుతుంది. స్వతంత్ర భారతదేశంలో ఇంత పెద్ద సంఖ్యలో జనాబాకు ఇంత పెద్ద సంక్షేమ పథకం ప్రవేశపెట్టలేదన్నారు. దీనిని సామాజిక న్యాయం కోసం ఒక నమూనాగా అభివర్ణించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడైనా రేషన్ తీసుకోవడానికి వీలుగా డ్రా సిస్టం అందుబాటులోకి తెస్తున్నామని వెల్లడించారు. ఎంత మందికి కొత్త రేషన్ కార్డులు కావాలన్నా అర్హతను బట్టి మంజూరు చేస్తామని, కొత్తగా ఫిజికల్ రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామని చెప్పారు. కార్డు ఉన్నా లేకున్నా లబ్ధిదారుల అర్హుల జాబితాలో పేరు ఉంటే సన్న బియ్యం ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇస్తున్నామన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు నాటికి 89 లక్షల 73వేల 708 కార్డులు ఉండేవని, గత పదేళ్ళలో 49వేల 479 కొత్త కార్డులు ఇచ్చారని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 90 లక్షల రేషన్ కార్డులుండగా 2.85 కోట్ల లబ్ధిదారులు రేషన్‌సరుకులు తీసుకున్నట్లు వివరించారు. కొత్త రేషన్ కార్డులో క్యూ ఆర్ కోడ్ మాత్రమే ఉంటదని చిప్ ఉండదని స్పష్టం చేశారు. రేషన్ కార్డుపై ప్రధాని



ఫొటోపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదని, 30 లక్షల మందికి కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రభుత్వం చేయబోతోందని తెలిపారు. దీంతో కార్డుల సంఖ్య కోటికి పెరుగుతుందని, మొత్తం లబ్ధిదారులు సంఖ్య 3.10 కోట్ల పెరుగుతుందన్నారు. కొత్తకార్డులు దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న కుటుంబాలకు (బీపీఎల్) త్రివర్ణ కార్డులు జారీ చేస్తామని, దారిద్ర్య రేఖకు ఎగువ ఉన్నవారికి (ఏపిఎల్) గ్రీన్ కార్డులు జారీ చేస్తామని చెప్పారు.

**పీడీఎస్‌బియ్యం కోసం రూ. 10, 665 కోట్లు ఖర్చు**

ప్రస్తుతం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా పంపిణీ వ్యవస్థ కోసం సంయుక్తంగా రూ. 10,665 కోట్లు ఖర్చు చేస్తున్నాయని, కేంద్రం రూ. 5,489.5 కోట్లు , రాష్ట్రం రూ. 5,175.5 కోట్లు భరిస్తుందన్నారు. కొత్త లబ్ధిదారులను చేర్చుకున్న తర్వాత, మొత్తం ఖర్చు రూ.13,523 కోట్లకు పెరుగుతుందని అంచనా వేసినట్లు చెప్పారు. రాష్ట్ర వాటా రూ.8,033 కోట్లకు పెరుగుతుందని, తెలంగాణ ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం దాదాపు రూ.2,858 కోట్లు ఉంటుందన్నారు. పేదల ప్రయోజనాల దృష్ట్యా ఈ ఖర్చును భరించడానికి ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని చెప్పారు. దశలవారీగా, పప్పు, ఉప్పు వంటి ఇతర ముఖ్యమైన వస్తువులను పంపిణీకి కూడా జరుగుతుందని, అదే సమయంలో, ప్రభుత్వం రేషన్ డీలర్ల నెట్‌వర్క్‌ను బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. వారి కమీషన్లు ఇప్పటికే పెంచామని, వారు విక్రయించగల ఇన్వెంటరీని విస్తరించడానికి, తద్వారా వారి జీవనోపాధిని మెరుగుపరచడానికి డెలివరీ గొలుసులో వారి పాత్రకు మద్దతు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్. చౌహాన్ పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే

### త్వరలో కాంగ్రెస్‌లోకి కొత్త ప్రభాకర్ రెడ్డి?



(మొదటిపేజీ తరువాయి)

అంతేగాక యూనివర్సిటీ నెలకొల్పేందుకు కావాల్సిన స్థల పరిశీలనకు దుబ్బాక వెళ్లాలని సీఎంఓకు ఆదేశాలు కూడా జారీ చేశారని తెలుస్తోంది. అలాగే దుబ్బాక నియోజకవర్గం లో ఎప్పటి నుంచో పెండింగ్ లో ఉన్న హబ్సీపూర్ లచ్చపేట్ కు రెండు వరుసల రోడ్డు నిర్మాణానికి రూ. 35 కోట్లు మంజూరు చేశారు. దీనికై సీఎం రేవంత్ రెడ్డికి దుబ్బాక ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలియజేశారు.

**త్వరలో కాంగ్రెస్ గూటికి?**

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆ జిల్లాలో ఉన్న ప్రత్యేక పరిస్థితులు, భవిష్యత్తు రీత్యా కాంగ్రెస్ గూటికి వెళ్ళే యోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇప్పటికే ఎంపీగా, ఎమ్మెల్యేగా పనిచేసిన కొత్త ప్రభాకర్ రెడ్డి బీఆర్ఎస్ లోనే ఉంటే.. అంతకుమించి ఎదిగే సూచనలు లేవన్న భావనతో ఉన్నట్లు పొలిటికల్ సర్కిల్స్ లో వినబడుతోంది. మరోవైపు అందరివాడుగా పేరున్న కొత్త ప్రభాకర్ రెడ్డి కాంగ్రెస్ లోకి వస్తే దుబ్బాకతో పాటు గజ్వేల్, సిద్దిపేట ఇతర నియోజకవర్గాల్లోనూ పార్టీకి కలిసివస్తుందన్న భావనతో కాంగ్రెస్ నేతలు కూడా సఖ్యతగా ఉంటున్నట్లు తెలుస్తోంది.

# ఈసారి అసెంబ్లీ బాగా జరిగింది

## అందరికీ అవకాశం లభించింది

### గతంలో మాట్లాడేవారిని.. మార్షల్స్ తో పంపేవారు

### సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని

**హైదరాబాద్, మహా:** గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో కంటే ఇపుడు సజావుగా అసెంబ్లీ సమావేశాలు జరిగాయని సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పార్టీ స్టేట్ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడారు. అందరికీ మాట్లాడే అవకాశం లభించిందని, గతంలో మాట్లాడే వారిని మార్షల్స్‌తో బయటకు పంపించే వారని విమర్శించారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.. అందరికీ అవకాశం ఇస్తున్నారని చెప్పారు. తాను టూరిజం డెవలప్మెంట్ చేయాలని చేసిన మాటలను ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు వక్రీకరించారని ఆరోపించారు. ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడం వల్ల టూరిజం ద్వారా నిధులు సమకూరుతాయని తాను చెప్పానని అన్నారు. కానీ చంద్రబాబు ఏ ఇజం లేదు.. టూరిజం మాత్రమే ఉందని 30 ఏళ్ల



క్రితం చెప్పానని.. ఇప్పుడు కమ్యూనిస్టులు కూడా ఒప్పుకున్నారని మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఆయన మండిపడ్డారు. ప్రజలు ఉన్నంత కాలం కమ్యూనిజం ఉంటుందని అన్నారు.

### రుణమాఫీ అందరికీ జరగాలి

రెండు లక్షల లోపు రుణమాఫీ అందరికీ జరగలేదని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. టెక్నీకల్ సమస్యలు ఉన్నాయని అంటున్నారు.. వాటిని పరిష్కరించి రుణమాఫీ అయ్యేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఏమి కొత్తగా లేదని అభిప్రాయపడ్డారు. విద్యా రంగానికి 14 శాతం నిధులు కేటాయించాలని అడిగాము.. కానీ 8 శాతం మాత్రమే కేటాయించారని అన్నారు. నిధుల కొరత ఉందని కొన్ని రంగాలకే ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు.

# మళ్ళీ స్టాలినే

### తమిళ ప్రజల మొగ్గు అటే సర్వేలన్నీ స్టాలిన్ వైపే

**మహా:** తమిళనాడులో ఎన్నికలు సమీపిస్తున్న తరుణాన సి ఓటర్ సర్వే నిర్వహించగా, ప్రజలు నిర్మొహమాటంగా స్టాలిన్ నే ఎన్నుకుంటామని తేల్చిచెప్పేశారు. అన్ని సర్వేలు స్టాలిన్ వైపే మొగ్గు చూపుతుండగా, తాజాగా సిఓటర్ సర్వే పకడ్బందీగా నిర్వహించగా.. మెజార్టీ ప్రజలు డిఎంకె అధినేత ఎంకే స్టాలిన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకున్నారు. సర్వేలో పాల్గొన్న వారిలో 27 శాతం మంది స్టాలిన్ సీఎంగా ఉండాలని చెప్పారు. ఇక కొత్తగా పార్టీ పెట్టిన సినీనటుడు విజయ్ సీఎంగా ఉండాలని 18 శాతం మంది కోరుకున్నారు.

ఆ తర్వాత స్థానాల్లో 10 శాతం మంది ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి, 9 శాతం మంది బీజేపీ తమిళనాడు చీఫ్ అన్నామలై కావాలని అన్నారు.ఈ సర్వేలో స్టాలిన్‌ను కోరుకునే వారి సంఖ్య అత్యధికంగా ఉండటం గమనార్హం. స్టాలిన్ లీడర్‌షిప్ పట్ల ఎక్కువ మంది పాజిటివ్‌గా స్పందించడం రాబోయే ఎన్నికల్లో డీఎంకే విజయానికి చిహ్నమని ఆ పార్టీ నేతలు అంటున్నారు. బిజెపి రాజకీయం పట్ల తమిళ ప్రజల్లో ఆగ్రహం ఉండగా, ప్రతిపక్ష అన్నాడిఎంకె బలహీన పడడం కూడా డిఎంకె కు కలిసివచ్చింది. డిఎంకె కు ప్రత్యామ్నాయంగా తమిళప్రజలు విజయ్ ను భావిస్తూ తర్వాత స్థానంలో నిలిపారు.

## ఈ సెషన్స్ రాష్ట్ర చరిత్రలో

# నిలిచిపోతాయి

### బీసీ బిల్లు పెట్టడం, ఎస్సీ వర్గీకరణ చేయడం చరిత్ర

### .. బడ్జెట్ సమావేశాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత



**హైదరాబాద్, మహా:** 202526 బడ్జెట్ సమావేశాలు రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఈ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ల బిల్లులు, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందాయని ఈ బిల్లులు రావడానికి బీఆర్ఎస్ పార్టీ కృషి ఎంతో ఉందన్నారు. శుక్రవారం శాసనమండలి మీడియా పాయింట్ వద్ద బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అప్పులపై కాంగ్రెస్ నేతల తప్పులు బయటపడ్డాయని ధ్వజమెత్తారు. రాష్ట్ర అప్పులు మొత్తం రూ.4 లక్షల 42 వేలు అని పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం రూ.8 లక్షల కోట్లు అప్పులు చేశామని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. శాసన మండలిలో ప్రజల గొంతుకగా బీఆర్ఎస్ వ్యవహరించిందని సమన్వయంతో అన్ని అవకాశాలను వాడుకొని ప్రభుత్వాన్ని ప్రశ్నించామన్నారు. అన్ని చర్చల్లో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టినట్లు చెప్పారు. ప్రజలు, రైతులు, మహిళలు వంటి అన్ని సమస్యలపై గళమెత్తాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుపై ప్రతీ రోజూ వినూత్న రీతిలో నిరసనలు, కేసీఆర్ పై ముఖ్యమంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలపై కూడా సభలో నిరసన తెలిపామన్నారు.

# ఉగాది తర్వాత ఏఐ సిటీకి భూమిపూజ

### ఫ్యూచర్ సిటీ మహేశ్వరంలోనే నిర్మాణం

### మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



**హైదరాబాద్, మహా:** ఉగాది తర్వాత "ఏఐ సిటీ" నిర్మాణానికి భూమి పూజ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. హైటెక్ సిటీలోని ఐటీసీ కోహినూర్ లో శుక్రవారం "క్లియర్ టెల్లిజెన్స్" ఇండియా డెలివరీ అండ్ ఆపరేషన్స్ సెంటర్ ను మంత్రి శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ... భావితరాల అవసరాలకు అనుగుణంగా సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా ఫ్యూచర్ సిటీని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇక్కడే 200 ఎకరాల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఏఐ సిటీని నిర్మిస్తామన్నారు. ఈ సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే అనేక టెక్ దిగ్గజ సంస్థలు ఆసక్తి వ్యక్తం చేశాయన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలకు ధీటుగా ఎమర్జింగ్ టెక్నాలజీస్ లో తెలంగాణ హబ్ గా మారుతుందన్నారు. డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీస్ లో ఇప్పటికే సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రాలను ప్రారంభించామని, త్వరలోనే "క్వాంటం కంప్యూటింగ్"లోనూ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు.

### పాలమూరు-రంగారెడ్డికి

# కేంద్రం షాక్

- ఆ ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కల్పించలేం
- తేల్చిచెప్పిన కేంద్ర ప్రభుత్వం



(మొదటిపేజీ తరువాయి)

స్పష్టం చేసింది. కృష్ణా ట్రిబ్యునల్2 ఇందుకు సంబంధించిన విచారణ చేపడుతోందని కేంద్ర జలశక్తి శాఖ అధికారులు ప్రస్తావించారు. కోర్టు వివాదం నేపథ్యంలో.. ఈ ప్రాజెక్టు టెక్నో ఎకనామిక్ రిపోర్ట్‌ను పరిగణనలోకి తీసుకోవడం సాధ్యం కాదని కేంద్ర జలశక్తి శాఖ తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో ప్రతిపాదనలు తెలంగాణ రాష్ట్రానికి తిరిగి పంపినట్లు లోక్‌సభలో కేంద్రం తెలిపింది. 2022 సెప్టెంబర్‌లో ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర జల సంఘానికి ప్రతిపాదనలు పంపిందని కేంద్ర ప్రభుత్వం గుర్తుచేసింది. 2024 డిసెంబర్‌లో ఈ ప్రతిపాదనలు తిప్పి పంపామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. లోక్‌సభలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జాతీయ ప్రాజెక్టు విషయంపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్న అడిగారు. ఈ ప్రశ్నకు జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

# యూఏఈ జైలు నుండి 500 మంది భారతీయ ఖైదీల విడుదల

**రంజాన్ సందర్భంగా యూఏఈ అధ్యక్షుడి నిర్ణయం**



**మహా :** రంజాన్ సందర్భంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జావేద్ ఆల్ నాహ్యాన్ అక్కడి జైల్లోని ఖైదీలకు క్షమాభిక్ష మంజూరు చేశారు. 1,295 మంది ఖైదీలను విడుదల చేయడంతో పాటు 1,518 మందికి క్షమాభిక్ష ప్రసాదించాలని నిర్ణయించారు విడుదలైన వారిలో 500 మందికి పైగా భారతీయులు ఉన్నారు. ఈద్ కోసం దేశం.. ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ పవిత్ర రంజాన్ మాసంలో, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఖైదీలను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఈద్ దృష్ట్యా, యుఎఇ జైళ్లలో ఉన్న ఖైదీలకు జీవితాన్ని గడపడానికి రెండవ అవకాశం ఇస్తోంది. దీనిని ఫిబ్రవరి చివరిలో ప్రకటించారు. ప్రధాన మంత్రి షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ ఖైదీలకు క్షమాభిక్ష ప్రకటించారు. జైలు నుండి విడుదల చేయాలని ఆదేశించిన వారిలో 500 మంది భారతీయ ఖైదీలు ఉండగా వారి కుటుం బాల్లో ఆనందం నిండు కుంది. యుఎఇ ఆదేశాన్ని అనుసరించి, ఈ సంవత్సరం ఈ భారతీయులు తమ కుటుంబాలతో ఈద్ జరుపుకోగలుగుతారు.

# ఏ గ్రామంలోనూ త్రాగునీటి సమస్య రావొద్దు

**జూన్ చివరినాటికి వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులు పూర్తికావాలి**

**మడికొండ డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం.. రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**మహా :** పైలట్ గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, బేస్‌మెంట్ పూర్తయిన ఇండ్లకు తక్షణం చెల్లింపులు జరపాలని వరంగల్ జిల్లా ఇన్ ఛార్జి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో వరంగల్ స్మార్ట్ సిటీ పనులు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, త్రాగునీరు, ఇందిరమ్మ ఇండ్లు తదితర అంశాలపై పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్య మంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డితో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా శాసనసభ్యులు, కలెక్టర్లు తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఈ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతాంశమని దీనిని దృష్టిలో పెట్టుకొని కలెక్టర్లు పని చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ప్రభుత్వం నాలుగు విడతలలో చెల్లింపులు చేస్తుందని, మొదటి విడతలో బేస్‌మెంట్ లెవెల్ పూర్తయిన ఇండ్లకు లక్ష రూపాయిలు ఇస్తుందని, బేస్ మెంట్ పూర్తయిన ఇండ్ల వివరాలను హౌసింగ్ విభాగానికి పంపిస్తే తక్షణమే చెల్లింపులు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో ఇండ్ల స్థలాలు లేని అర్హత కలిగిన లబ్దిదారులకు ఇప్పటివరకు కేటాయించని 2 బిహెచ్‌కే ఇండ్లను కేటాయించాలని అలాగే మొండి గోడలతో ఉన్న ఇండ్లను పూర్తి చేయడానికి కాంట్రాక్టర్ ముందుకు రాని పక్షంలో లబ్దిదారులే ఆ ఇండ్లను పూర్తిచేసుకోవడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని లబ్దిదారులను ఎంపిక చేసి ఇండ్లను కేటాయించాలని సూచించారు. వేసవి కాలంలో ఏ గ్రామంలో పట్టణంలో త్రాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా జిల్లా కలెక్టర్లు ఈ అంశానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అధికారులతో సమన్వయం చేసుకొని అధికారులు వారంలో మూడు రోజులు గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. వచ్చే మూడు నెలలు చాలా కీలకమని ప్రజలకు ఎక్కడా త్రాగునీటి గురించి ఇబ్బంది కలగకుండా నీళ్లు రావడం లేదన్న విమర్శ రాకుండా పనిచేయాలన్నారు. నీటి కొరత ఉన్న ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా త్రాగునీరు సరఫరా చేయడం, చెడిపోయిన బోర్లు, హ్యాండ్ పంప్ లను తక్షణం మరమ్మతులు చేపట్టాలని సూచించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవన నిర్మాణ పనులను రెండు నెలల్లో పూర్తి చేసి ఆ తర్వాత మరో నెలరోజుల్లో వైద్య సేవలకు అవసరమైన పరికరాలను అమర్చి జూన్ చివరి నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలి. ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. మడికొండ డంపింగ్ యార్డు సమస్యకు వారం రోజుల్లో తాత్కాలిక పరిష్కారం చూపించి ఆ తర్వాత శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దీనికి సంబంధించి సీడీఎంఏ డైరెక్టర్ శ్రీదేవిని స్వయంగా అక్కడ పర్యటించి పరిష్కార మార్గాలను సూచించాలని ఆదేశించారు. వరంగల్, కరీంనగర్ రహదారి ప్రాంతంలో శాశ్వత డంపింగ్ యార్డు కోసం 150 నుంచి 200 ఎకరాల భూమిని సేకరించాలని కలెక్టర్లను ఆదేశించారు. వరంగల్ భద్రకాళి చెరువు పూడికతీత పనులను ఎట్టిపరిస్థితులలోను వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు పూర్తిచేయాలన్నారు. వరంగల్ స్మార్ట్ సిటీ పనుల విషయంలో అధికారులు ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో శాసనసభ్యులు కడియం శ్రీహరి, నాయని రాజేందర్, యశస్విని రెడ్డి, దొంతి మాధవరెడ్డి, నాగరాజు, మురళీనాయక్, రామచంద్ర నాయక్, రేవూరి ప్రకాష్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, ఆర్ అండ్ బి సెక్రెటరీ హరిచందన, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టులో ఎమ్మెల్యేకు దక్కని ఊరట

**ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుపై హైకోర్టులో పిటిషన్ వేసిన సుధీర్ రెడ్డి**

**విచారణను 10 రోజులు వాయిదా వేసిన కోర్టు**



**మహా :** తనపై నమోదైన ఎస్సీ, ఎస్టీ ఆట్రాసిటీ కేసును కొట్టి వేయాలంటూ ఎల్ బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వేసిన పిటిషన్ పై హైకోర్టు శుక్రవారం విచారించింది. కేసు కొట్టి వేసేందుకు నిరాకరించిన కోర్టు పది రోజుల పాటు విచారణను వాయిదా వేసింది. సుధీర్ రెడ్డి రిటిషన్ పై కౌంటర్ దాఖలు చేయాలని బాధితురాలు సుజాత నాయక్ ను కోర్టు ఆదేశించింది. బీఎన్ రెడ్డి నగర్ కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ పై చేసిన అనుచిత వ్యాఖ్యల కేసులో హైకోర్టును ఆశ్రయించిన సుధీర్ రెడ్డి. కేసును కొట్టి వేయాలని, అరెస్టు చేయవద్దని చేసిన అభ్యర్థనపై ఊరట దక్కలేదు.

# కరాటే ఛాంపియన్‌షిప్ గ్రాండ్ ఓపెనింగ్

**ప్రముఖ నేతల సమక్షంలో పోటీలు ప్రారంభం!**

- **స్పీకర్ ప్రసాద్ వర్సెస్ మంత్రి పొన్నం – కరాటేలో సరదా పోటీ**
- **ప్రత్యేక ఆకర్షణగా నిఖత్ జరీన్**



**మహా :** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేరుగా కరాటే రింగ్‌లో తలపడ్డారు. ఇదేదో యాక్షన్ సినిమా సన్నివేశం కాదు, హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో వాస్తవంగా జరిగిన విశేషం. శుక్రవారం గచ్చిబౌలి స్టేడియంలో 4వ కియో నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ 2025 ఘనంగా ప్రారంభమైంది. ఈ వేడుకలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమం రసవత్తరంగా సాగుతున్న వేళ, నిర్వాహకులు స్పీకర్ ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు గౌరవార్థం కరాటే బ్లాక్ బెల్ట్‌ను ప్రదానం చేశారు. కరాటే బెల్ట్‌లు అందుకున్న వెంటనే, ఇద్దరు నేతలు కరాటే పోజులిస్తూ ఫోటోలకు ఫోజులిచ్చారు. నేతల సరదా పోజులు చూసి వేదికపైనే కాక, ప్రేక్షక లోకంలోనూ కాసేపు హర్షధ్వానాలు మార్మోగాయి. మామూలుగా సభల్లో మాటలతోనే ఎదిరించే రాజకీయ నాయకులు, ఇప్పుడు కరాటే రింగ్‌లో తలపడుతున్నట్టుగా కనిపించడం విశేషమైంది. మూడురోజుల పాటు కొనసాగనున్న ఈ కియో నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ ప్రారంభోత్సవానికి భారత బాక్సింగ్ ప్రపంచ ఛాంపియన్ నిఖత్ జరీన్ హాజరవ్వడం మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆమె తన స్పీచ్‌లో యువ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, క్రీడా ప్రాముఖ్యతను వివరించారు.

**క్రీడాకారులను ప్రోత్సహిస్తాం : టీ పీసీసీ చీఫ్**

ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ మాట్లాడుతూ, "అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో ప్రతిభ చూపే క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందన్నారు. క్రీడల ద్వారా యువత శారీరకంగా, మానసికంగా బలపడాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, "క్రీడలు మన జీవితంలో చాలా ప్రాముఖ్యత కలిగి ఉంటాయి. క్రీడల్లో పాల్గొంటే లైఫ్‌లో ఎదురయ్యే ప్రతీ సవాలును ధైర్యంగా ఎదుర్కోవచ్చు" అని తెలిపారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ, "తెలంగాణ రాష్ట్రం క్రీడల్లో ముందంజలో ఉండాలని, ప్రభుత్వ సహాయంతో క్రీడా సౌకర్యాలు మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఉన్నాం" అని తెలిపారు. క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ, "ఈ ఛాంపియన్‌షిప్ ద్వారా ఎంతోమంది యువ క్రీడాకారులకు ప్రోత్సాహం లభిస్తుంది. రాబోయే రోజుల్లో మరింత గొప్ప స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నాం" అని చెప్పారు. ఈ కియో నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో దేశవ్యాప్తంగా వేలాది మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. క్రీడాభిమానులకు ఇది ఒక అద్భుతమైన అనుభూతిని అందించే అవకాశముంది. రాబోయే మూడు రోజుల్లో వివిధ విభాగాల్లో ఆసక్తికరమైన పోటీలు జరగనున్నాయి. క్లుప్తంగా చెప్పాలంటే, ఈ కరాటే ఛాంపియన్‌షిప్ ప్రారంభోత్సవం నేతల సరదా ముమ్మరాలతో, క్రీడా ప్రాధాన్యతను చాటిచెప్పే ప్రసంగాలతో, యువ క్రీడాకారుల ఉత్సాహంతో జయప్రదంగా సాగింది



# అనుమానిత ప్రదేశం గుర్తింపు

**35వ రోజు ఎస్ ఎల్ బిసి సొరంగంలో తవ్వకాలు**

**నాగర్ కర్నూల్, మహా:** ఎస్ ఎల్ బిసి సొరంగంలో చిక్కుకున్న కార్మికుల కోసం 35వ రోజు అన్వేషణ కొనసాగుతోంది. బురదలో కూరుకుపోయిన లోకో ట్రైన్ పరిసరాల్లో మరో సారి అనుమానిత ప్రాంతాన్ని కడవర్ డాగ్స్ సూచించాయి. కడవర్ డాక్స్ సూచించిన ప్రదేశంలో సహాయక బృందాలు తవ్వకాలు మొదలుపెట్టాయి. ఉదృతంగా వస్తున్న నీటి ఊట తో తవ్వకాలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. వస్తున్న నీటి ఊటను ఎప్పటికప్పుడు భారీ పంపులతో కృష్ణా నదిలోకి మళ్ళిస్తున్నారు. మూడు షిఫ్టులలో దాదాపు 600 మంది రెస్క్యూ బృందాలు నిర్విరామంగా సహాయక చర్యలు చేపడుతున్నాయి.

# ఢిల్లీ కోర్టు ఆదేశాలతో కేజ్రీవాల్ పై ఎఫ్ఐఆర్ నమోదు

**2019లో ఢిల్లీ వ్యాప్తంగా పెద్ద హోర్డింగ్ లు ఏర్పాటు చేసిన ఆప్ నేతలు**

**ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారంటూ తీవ్ర ఆరోపణలు**

**కేసు నమోదు చేయాలంటూ పోలీసులను ఆదేశించిన రౌస్ అవెన్యూ కోర్టు**



**మహా :** ఆప్ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పై పోలీసు కేసు నమోదయింది. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారనే అభియోగాలతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఢిల్లీ వ్యాప్తంగా పెద్ద హోర్డింగ్ లు ఏర్పాటు చేయడానికి నిధులను దుర్వినియోగం చేశారంటూ కేజ్రీవాల్, ఇతరులపై ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో వీరిపై కేసులు నమోదు చేయాలని ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు మార్చి 11న పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కేజ్రీవాల్ పై కేసు నమోదు చేసినట్టు కోర్టుకు పోలీసులు నివేదిక సమర్పించారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టినట్టు నివేదికలో పేర్కొన్నారు. తదుపరి విచారణను కోర్టు ఏప్రిల్ 18కి వాయిదా వేసింది. 2019లో అప్పటి మటియాలా ఆప్ ఎమ్మెల్యే గులాబ్ సింగ్, ద్వారక ఏ వార్డు మాజీ కౌన్సిల్ నితికా శర్మ భారీ హోర్డింగ్ లు ఏర్పాటు చేశారు. దీంతో, వీరు ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వ నిధులను నిర్వీర్యం చేశారంటూ విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది.

# బ్రిటీష్ వాళ్లు ఒక్క ఇంగ్లీష్ ని మాత్రమే వదిలేసి... అంతా తీసుకుపోయారు

**ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తోంది**

**కమ్యూనికేషన్ రంగంలో ప్రైవేట్ సంస్థల ఎంట్రీ గేమ్ ఛేంజర్**

**అందరం కలిసి కృషి చేస్తే ఇండియా నెంబర్ వన్ స్థానానికి చేరుకుంటుంది**

**మద్రాస్ ఐఐటీలో ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ప్రసంగం**



**మహా :** కొంతకాలంగా భారత్ వృద్ధిరేటు ప్రపంచంలోనే అత్యధికంగా ఉందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 2014లో ప్రపంచంలో పదో ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ ఇప్పుడు ఐదో స్థానానికి చేరుకుందని చెప్పారు. యావత్ ప్రపంచం ఇప్పుడు భారత్ వైపే చూస్తోందన్నారు. మద్రాస్ ఐఐటీలో శుక్రవారం నిర్వహించిన 'ఆల్ ఇండియా రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్ 2025' కార్యక్రమానికి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. మద్రాస్ ఐఐటీ ఎన్నో విషయాలలో నెంబర్ వన్ గా ఉందని చంద్రబాబు కితాబునిచ్చారు. ఎన్నో రకాల ఆన్ లైన్ కోర్సులు కూడా అందిస్తోందని చెప్పారు. ఐఐటీ మద్రాస్ స్టార్టప్ లలో 80 శాతం సక్సెస్ అవుతున్నాయని తెలిపారు. స్టార్టప్ అగ్నికుల్ మంచి విజయాన్ని అందుకుందని చెప్పారు. మద్రాస్ ఐఐటీలో 35 నుంచి 40 శాతం మంది తెలుగు విద్యార్థులే ఉన్నారని అన్నారు. ఐఐటీలను స్థాపించడం దేశ విద్యారంగంలో గొప్ప ముందడుగు అని చెప్పారు. 1991లో తీసుకొచ్చిన సంస్కరణలతో భారత్ అభివృద్ధి బాట పట్టిందని చంద్రబాబు అన్నారు. అదే సమయంలో చైనా ఆర్థిక సంస్కరణలు చేపట్టిందని... ఆ తర్వాత ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని చెప్పారు. బ్రిటీష్ వాళ్లు ఒక్క ఇంగ్లీష్ ను మాత్రమే మనకు వదిలేసి... మన దేశం నుంచి అంతా తీసుకుపోయారన్నారు. 1990లలో కమ్యూనికేషన్ రంగంలో బీఎస్ఎన్ఎల్, వీఎస్ఎన్ఎల్ మాత్రమే ఉండేవని, ఆర్థిక సంస్కరణల తర్వాత ప్రైవేట్ సంస్థల ఎంట్రీ ఇవ్వడం ఒక గేమ్ ఛేంజర్ అని చెప్పారు. మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌ను కలుస్తానని చెప్పినప్పుడు రాజకీయ నాయకులతో తనకు సంబంధం లేదని ఆయన చెప్పారని, ఆ తర్వాత ఆయనను ఒప్పించి అపాయింట్ మెంట్ తీసుకున్నానని, 45 నిమిషాలు మాట్లాడానని తెలిపారు. హైదరాబాద్ లో మైక్రోసాఫ్ట్ కంపెనీ పెట్టాలని కోరానని చెప్పారు. ఇప్పుడు అదే మైక్రోసాఫ్ట్ కు తెలుగు వ్యక్తి సత్య నాదెళ్ల సీఈవోగా ఉన్నారని కొనియాడారు. మన దేశానికి ఉన్న గొప్ప వరం జనాభా అని చంద్రబాబు చెప్పారు. చాలా దేశాలు జనాభా తగ్గుదల సమస్యను ఎదుర్కొంటున్నాయని, మన దేశానికి మరో 40 ఏళ్ల వరకు ఆ సమస్య లేదని అన్నారు. అందరం కలిసి కృషి చేస్తే త్వరలోనే భారత్ అగ్రస్థానానికి చేరుకుంటుందని చెప్పారు.

# పెద్దపల్లిలో పరువు హత్య

- **యువకుడిని గొడ్డలితో నరికి చంపిన యువతి తండ్రి**
- **పుట్టిన రోజే హత్యకు గురైన యువకుడు**
- **కన్నూరు మున్నీరుగా విలపిస్తున్న కుటుంబసభ్యులు**

**మహా :** పెద్దపల్లి జిల్లాలో పరువు హత్య జరిగింది. కూతురిని ప్రేమించాడని యువకుడిని గొడ్డలితో కిరాతకంగా నరికి చంపాడు తండ్రి. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామానికి చెందిన పూరెల్ల సాయికుమార్, అదే గ్రామానికి చెందిన ఓ యువతి గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరి కులాలు వేర్వేరు కావడంతో ప్రేమకు అడ్డు చెప్పాడు యువతి తండ్రి. అంతేకాకుండా ఇక నుంచి అమ్మాయితో మాట్లాడొద్దని సాయికుమార్‌ను యువతి తండ్రి హెచ్చరించాడు. కానీ అమ్మాయి, అబ్బాయి ఇద్దరూ మాట్లాడుకుంటూనే ఉన్నారు. దీంతో ఆగ్రహంతో రగిలిపోయి, ఎలాగైనా ప్రియుడిని చంపాలని నిర్ణయించిన యువతి తండ్రి అదను కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద గురువారం రాత్రి పది గంటల సమయంలో సాయికుమార్ తన స్నేహితులతో కూర్చుని సరదాగా మాట్లాడుతుండగా, ఆ సమయంలో అమ్మాయి తండ్రి గొడ్డలితో అక్కడికి చేరుకున్నాడు. అనంతరం ఒక్కసారిగా గొడ్డలితో విచక్షణారహితంగా సాయికుమార్‌పై దాడి చేయడంతో సాయికి తీవ్ర గాయాలయ్యాయి. అతని స్నేహితులు, కుటుంబసభ్యులు, సాయికుమార్‌ను హుటాహుటిన సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యం అందిస్తుండగానే సాయికుమార్ మృతి చెందాడు.

# విత్తనాలను అందుబాటులో ఉంచాలి

**వానాకాలం పంటలపై మంత్రి తుమ్మల సమీక్ష**

**విత్తనాల సరఫరా, లభ్యతపై ఆరా.. నాణ్యమైన విత్తనాల ఎంపిక, కొనుగోళ్ళలో రైతులకు అవగాహన కార్యక్రమాలు**



**మహా :** వానాకాలం 2025కు సంబంధించి విత్తనాల అవసరం, లభ్యత, సరఫరాపై రాష్ట్రస్థాయి వ్యవసాయాధికారులతో విత్తన కంపెనీ ప్రతినిధులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. వానాకాలం 2025 లో 66.80 లక్షల ఎకరాలలో వరి, 6 లక్షల ఎకరాలలో మొక్కజొన్న, 50 లక్షల ఎకరాలలో ప్రత్తి, 9 లక్షల ఎకరాలలో సోయా చిక్కుడు సాగు అవుతుందని సమీక్షలో అధికారులు అంచనా వేశారు. దానికి తగ్గట్లుగా 16.70 లక్షల క్వింటాళ్ళ వరి విత్తనాలు, 0.48 లక్షల మొక్కజొన్న, 89 లక్షల ప్రత్తి ప్యాకేట్లు, 1.35 లక్షల క్వింటాళ్ళ సోయాచిక్కుడు విత్తనాలు అవసరమవుతాయని, వరిలో సన్న బియ్యం సాగు ఈ సారి ఇంకా పెరిగే అవకాశమున్నందున సన్నరకాల విత్తనాలను అధికమొత్తంలో అందుబాటులో ఉంచడానికి ఏర్పాట్లు చేశామని ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి చెప్పారు. 2.4 కోట్ల ప్రత్తి విత్తన ప్యాకేట్లు అందుబాటులో ఉంచడం జరుగుతుందని, జిల్లాల వారిగా, ప్రాంతాల వారిగా డిమాండ్ ఉన్న ప్రత్తి రకాలను అవసరం కంటే అధికమొత్తంలో తెప్పించి రైతులకు అందుబాటులో ఉంచడానికి కంపెనీలకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. పచ్చిరొట్ట విత్తనాలకు సంబంధించి ఈ వానాకాలం కంటే ముందుగా ఎప్రిల్ మాసములోనే విత్తనాలు తెప్పించి అందుబాటులో ఉంచే విధంగా ఇప్పటికే టీజీ సీడ్స్ కు 1.94 లక్షల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాల సరఫరాకు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని, వీటి సరఫరాలో ఎక్కడా లోపాలు తలెత్తకుండా పకడ్బంది చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, గత అనుభవాల దృష్ట్యా డిమాండ్ ఉన్న రకాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వరిపంట సాగుచేస్తున్న రైతుల నుండి బెరుకులు ఎక్కువగా రావడం, తొందరగా కంకి వెయ్యడం లాంటి ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిని సరిదిద్ధి, నాణ్యమైన విత్తనాన్ని రైతులకు అందుబాటులో ఉంచేందుకు కావాల్సిన అన్ని చర్యలు చేపట్టాలన్నారు.

విత్తనోత్పత్తి చేస్తున్న రైతులు నష్టపోయిన సందర్భాలు ప్రభుత్వం దృష్టికి వస్తున్నాయని, విత్తన కంపెనీలకు రైతులకు మధ్య వారధిగా ఉన్న ఆర్గనైజర్లలో కొంతమంది రైతులకు దక్కాల్సిన ధరను కాని, చెల్లించాల్సిన డబ్బుల విషయంలో కానీ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. సత్వరమే సీడ్ మెన్ అసోసియేషన్ మరియు కంపెనీ ప్రతినిధులు కూర్చొని విత్తనోత్పత్తి ఒప్పందాలు కంపెనీలకు, రైతులకు మధ్య కుదిరేలా, పండించిన విత్తనానికి చెల్లించే మొత్తం కానీ, సరిగ్గా పంటరాని సందర్భంలో చెల్లించే పరిహారం కానీ రైతులకే చెల్లించే విధంగా చూడాలని, ఇకముందు ఎక్కడైనా ఇటువంటి ఫిర్యాదులు వస్తే ప్రభుత్వం ఆయా కంపెనీల పట్ల కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. వ్యవసాయాధికారులు వారివారి పరిధిలో ఉన్న విత్తన కంపెనీలను తరుచూ పర్యవేక్షించి, రైతులకు నాణ్యమైన విత్తనం అందేలా చూడాలని, అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు విత్తన ఎంపికలో, కొనుగోళ్లలో పాటించాల్సిన విషయాలపై అవగాహన కార్యక్రమాలు రైతు వేదికలలో చేపట్టాలన్నారు. పోలిస్ శాఖతో సమన్వయం చేసుకుంటు గ్రామాలలో లేబుల్ లేకుండా విత్తనాలు అమ్మే వారిని నియంత్రించే విధంగా చూడాలని ఆదేశించారు. ఇదే సందర్భంలో రాష్ట్రంలో కూరగాయల విత్తనాల లభ్యత, దిగుబడులపై కూడా కంపెనీ ప్రతినిధులతో ఆరా తీసి, కూరగాయల విస్తీర్ణాన్ని పెంచడానికి నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సెక్రటరి రఘునందన్ రావు, టి.జి సీడ్స్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, సీడ్స్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, సీడ్ మెన్ అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

EDITORIAL
సంపాదకీయం

# సంఘం శరణం గచ్ఛామి

**బెంగళూరులో 1460 మందితో ఆర్ఎస్ఎస్ అఖిల భారతీయ ప్రతినిధి సభ జరిగింది. ఆర్ఎస్ఎస్ ను స్థాపించి 100 సంవత్సరాలు కనుక ఇది ప్రత్యేకం. వచ్చే దసరా అక్టోబర్ 2 వరకు వివిధ రకాల కార్యక్రమాల రూపకల్పన జరిగింది. ఈ సమావేశంలో వేర్వేరు రాష్ట్రాలలో నుంచి ప్రతినిధులు ఇచ్చిన నివేదికల కంటే తెలంగాణ నివేదికను పరిశీలిస్తే దేశ వ్యాప్తంగా గత ఏడాదికన్నా పదివేల శాఖలు పెరిగాయి. ఇందులో తెలంగాణలో 1839 స్థలాలలో 3117 శాఖ లు జరుగుతున్నాయి. రాష్ట్రంలోనూ 392 శాఖలు గతం కన్నా పెరిగాయి.**





**- గడ్డం క్రిష్ణమూర్తి,**
**సీనియర్ జర్నలిస్ట్, అసోసియేట్ ఎడిటర్**

లక్ష్యాన్ని పెట్టుకోవాలి, దాన్ని సాధించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలను సిద్ధం చేసుకోవాలి, తర్వాత ఆ వ్యూహాలను అమలు చేయాలి. ప్రస్తుతం తెలంగాణ బీజేపీ ఈ దిశలో వెళ్తుంది. దక్షిణాదికి తెలంగాణను హబ్ గా చేసుకుని బీజేపీని బలోపేతం చేసేందుకు గత కొన్నాళ్ళుగా కాషాయ పార్టీ ప్రయత్నాలను వేగవంతం చేస్తుంది. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో బలమైన శక్తిగా ఎదిగింది. కానీ ఒక్క పొరపాటుతో ఆ పార్టీ అనుకున్న లక్ష్యానికి అందనంత దూరంలో ఉండిపోయింది. గత పొరపాట్లు తిరిగి జరుగకుండా ఉండాలంటే మాత్ర సంస్థ సహకారం కావాలన్నఏకైక అభిప్రాయంతో ఆ పార్టీ వెళ్తుంది. ఇందుకు ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలను విస్తరించుకోవడమే మార్గంగా కాషాయసేన ను తెలంగాణలో రాబోయే అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్ గా ప్రధాన పార్టీలు వ్యూహాలకు పదును పెడుతోంది. పార్టీ ప్రణాళికలు, కార్యాచరణ అంతా అందుకు అనుగుణంగా డిసైడ్ చేసుకుంటుంది. అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్ గా పెట్టుకున్న బీజేపీ ఆ దిశగా త్వరలోనే పూర్తి స్థాయిలో యాక్షన్ మోడ్ లోకి దిగబోతున్నట్లు స్పష్టమవుతోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు ఓ అవకాశంగా మలుచుకునేందుకు బీజేపీ అన్ని రకాల ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్న క్రమంలో ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన ఓ ప్రకటన స్టేట్ పాలిటిక్స్ లో ఇంట్రెస్టింగ్ మారింది. ఇటీవల రెండు ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకోవడం ద్వారా జోష్ మీదున్న బీజేపీ రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి పవర్ లోకి వచ్చేందుకు ప్రయత్నాలను వేదవంతం చేసింది. ఇందుకోసం మహారాష్ట్ర, ఢిల్లీలో ఆ పార్టీ విజయానికి కారణమైన ఫార్ములాను తెలంగాణలోనూ అమలు చేయనున్నార నే టాక్ ఇప్పుడు జోరందుకుంది. తాజాగా ఆర్ఎస్ఎస్ తెలంగాణ కార్యదర్శి కాచం రమేశ్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తిగా మారాయి. సంఘ్ ఆలోచనలు, భావాలను వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి తెలంగాణలోని గ్రామ గ్రామానికి తీసుకువెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని వెల్లడించారు.

> **బీజేపీ మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ తన కార్యకలాపాలను విస్తరిస్తూనే అనుబంధ విభాగాలకు వీలైనంత సహకరించేందుకు కావాల్సిన వ్యూహాలకు ఎప్పటికప్పుడు పదును పెడుతుంది. తన అనుబంధ విభాగాలకు ఎప్పటికప్పుడు సలహాలు ఇస్తూనే ఆయా సంస్థల పురోభివృద్ధికి తోడ్పాటును అందిస్తుంది. ఇందులో భాగంగామహారాష్ట్ర, ఢిల్లీ ఎన్నికల్లో ఆర్ఎస్ఎస్ క్షేత్రస్థాయిలో చేసిన పనితోనే బీజేపీ గద్దెనెక్కింది.**

> **తెలంగాణలో ఆర్ఎస్ఎస్ క్షేత్రస్థాయిలో ఇప్పటికే పని మొదలు పెట్టేసిందని తెలంగాణ గిరిజన డెవలప్మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మెన్ బెల్లయ్య నాయక్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ను అడ్డుకునేందు తెలంగాణలో ఆర్ఎస్ఎస్ రంగంలోకి దిగిందని, ఆ సంస్థ చాప కింద నీరులా పాతుకుపోతున్నదన్నది ఆయన అభిప్రాయం.**

ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్రంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడిస్తూనే మహారాష్ట్ర, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు ఆర్ఎస్ఎస్ కీలక భూమిక పోషించిందన్నారు. తెలంగాణలోనూ ఆర్ఎస్ఎస్ తన కార్యకలాపాలను విస్తరించడం అంటే అది బీజేపీ బూస్ట్ ఇచ్చే అంశమే. ఈసారి తెలంగాణలో అధికారంలోకి రావడమే గురిగా పెట్టుకున్న కమలం పార్టీ నేతలు పక్కా వ్యూహంలో భాగంగానే ఆర్ఎస్ఎస్ చేత క్షేత్రస్థాయిలో పకడ్బందీ ప్లాన్ చేస్తోంది. ఇదే జరిగితే రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి పరిణామాలు ఉండబోతున్నాయనేది ఉత్కంఠగా మారింది. ఆర్ఎస్ఎస్ జోరుతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పై చర్చ జరుగుతోంది. ఈ రెండు పార్టీల పని అయిపోయిందని రాబోయే ఎన్నికల్లో అధికారం తమదేనని బీజేపీ నేతలు ఇప్పటికే పదే పదే చెబుతున్నారు. ఇటువంటి తరుణంగా ఆర్ఎస్ఎస్ ను ఎదుర్కొనే విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ లు ఏ మేరకు సిద్ధంగా ఉన్నాయనేది ఆలోచించాల్సిన విషయం. చాపకింద నీరులా ఆర్ఎస్ఎస్ తన కార్యాచరణను విస్తరించుకుంటోంది. ఇలా చేయడంలో ఆర్ఎస్ఎస్ దే ఎప్పుడూ పై చేయగానే ఉంటుంది. తెలంగాణలో ఆర్ఎస్ఎస్ క్షేత్రస్థాయిలో ఇప్పటికే పని మొదలు పెట్టేసిందని తెలంగాణ గిరిజన డెవలప్మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మెన్ బెల్లయ్య నాయక్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ను అడ్డుకునేందు తెలంగాణలో ఆర్ఎస్ఎస్ రంగంలోకి దిగిందని, ఆ సంస్థ చాప కింద నీరులా పాతుకుపోతున్నదన్నది ఆయన అభిప్రాయం. బెంగళూరు లో 1460 మందితో ఆర్ఎస్ఎస్ అఖిల భారతీయ ప్రతినిధి సభ జరిగింది. ఆర్ఎస్ఎస్ ను స్థాపించి 100 సంవత్సరాలు కనుక ఇది ప్రత్యేకం.

వచ్చే దసరా అక్టోబర్ 2 వరకు వివిధ రకాల కార్యక్రమాల రూపకల్పన జరిగింది. ఈ శమావేశంలో వేర్వేరు రాష్ట్రాలలో నుంచి ప్రతినిధులు ఇచ్చిన నివేదికల కంటే తెలంగాణ నివేదికను పరిశీలిస్తే దేశ వ్యాప్తంగా గత ఏడాదికన్నా పదివేల శాఖలు పెరిగాయి. ఇందులో తెలంగాణలో 1839 స్థలాలలో 3117 శాఖ లు జరుగుతున్నాయి. రాష్ట్రంలోనూ 392 శాఖలు గతం కన్నా పెరిగాయి. వారానికి ఒక్కసారి 32147 నెల వారి 12091 శాఖలు నిర్వహిస్తున్నారు. ఈ శాఖా కార్యక్రమాలకు యువకులు, విద్యార్థులు అధికంగా హాజరవుతున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా దేశ వ్యాప్తంగా 90 వేల సేవా కార్యక్రమాలను ఆర్ఎస్ఎస్ నిర్వహిస్తోంది. ప్రతి జిల్లాలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని గ్రామ వికాసం కార్యక్రమం పేరుతో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. విజయ దశమి పర్వదిన్నాన్ని పురస్కరించుకుని 161 స్థలాల లో 21,000 మందితో తెలంగాణ లో ఆర్ఎస్ఎస్ రూట్ మార్చ్ జరిగింది. ఇదంతా ఒక ఎత్తైతే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని పరోక్షంగా ఫోకస్ చేసేందుకు వీలుగా వచ్చే నవంబర్, డిసెంబర్ మాసాల్లో తెలంగాణలో ఇంటింటికీ ఒక కరపత్రం, పుస్తకం తో జన సంపర్క అభియాన్కు ఆర్ఎస్ఎస్ సన్నద్ధమవుతోంది. అదే విధంగా జిల్లా, నగర కేంద్రాలలో ప్రముఖులతో సమావేశాలు, యువజన సదస్సులు కూడా నిర్వహించాలని సంకల్పించింది.

బీజేపీ మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ తన కార్యకలాపాలను విస్తరిస్తూనే అనుబంధ విభాగాలకు వీలైనంత సహకరించేందుకు కావాల్సిన వ్యూహాలకు ఎప్పటికప్పుడు పదును పెడుతుంది. తన అనుబంధ విభాగాలకు ఎప్పటికప్పుడు సలహాలు ఇస్తూనే ఆయా సంస్థల పురోభివృద్ధికి తోడ్పాటును అందిస్తుంది. ఇందులో భాగంగామహారాష్ట్ర, ఢిల్లీ ఎన్నికల్లో ఆర్ఎస్ఎస్ క్షేత్రస్థాయిలో చేసిన పనితోనే బీజేపీ గద్దెనెక్కింది. ఢిల్లీలో బలంగా ఉన్న ఆప్ ప్రభుత్వాన్ని గద్దెదించాలన్న సంకల్పంతో ఎన్నికలకు ఏడాది ముందు నుంచే ఆర్ఎస్ఎస్ తన శ్రేణులను కార్యోన్ముఖులను చేసి క్షేత్రస్థాయిలో బీజేపీ బలం, బలహీనతలపై నివేదికలను తెప్పించుకుంది. బీజేపీ వ్యతిరేక ఓటు చీలకుండా ఉండాలంటే కూటమిగా వెళ్ళాలన్నకాంగ్రెస్ ఆలోచనను గుర్తించిన బీజేపీ ఆర్ఎస్ఎస్ సహాయం కోరింది. దీంతో విజయం సులభమైంది. అదే తరహాలో తెలంగాణలోనూ బీజేపీకి మరింత ఊపిరి పోసి నిలబెడితే ఉత్తరాదితో పాటు దక్షిణాదిలోనూ బీజేపీ హవా కొనసాగుతుందన్న ఆలోచనలో భాగంగానే ఆర్ఎస్ఎస్ అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఎన్నికలకు దాదాపు మూడేళ్ళ కాలం ఉన్నా ఇప్పటి నుంచే తన వ్యూహాల అమలు కోసం ఆర్ఎస్ఎస్ కొత్త తరహాలో వెళ్ళాలని భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

**రచనలకు ఆహ్వానం**
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన
**చిరునామా:**
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

# కమీషన్ల ప్రచారం.. అపర బ్రహ్మ కేసీఆర్ సృష్టి?





**- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్**

కాంగ్రెస్ ప్రభుత్వంలో 20 శాతం,30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారంటూ గడచిన ఏడాదికాలంగా బిఆర్ఎస్ ఒక పద్ధతి ప్రకారం ప్రచార కాండ సాగిస్తోంది. ఫార్మ్ హౌజ్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ దర్శకత్వంలోనే ఈ తంతు సాగుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. .ప్రత్యర్థులపై ఇలాంటి ఆరోపణలు చేయడం,వారిని అప్రదిష్ట పాల్జేయడం బిఆర్ఎస్ కు వెన్నతో పెట్టిన విద్య.' 30% కమిషన్ ప్రభుత్వం' అని కేటీఆర్ నిర్వచించడం అందులో భాగమే. అవినీతి ప్రభుత్వం,అక్రమాల ప్రభుత్వం అనడం వేరు. అలాంటి మాటలు త్వరగా జనానికి ఎక్కవనే ఉద్దేశంతో 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారన్న ప్రచారాన్ని ఎజండా పైకి తీసుకువచ్చారు. బహుశా వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రధాన ప్రచార అస్త్రంగా మారినా ఆశ్చర్యమేమీ లేదు.' జగన్ లక్ష కోట్ల కుంభకోణం', 30 శాతం కమీషన్ రెండూ ఒకటే. వైఎస్.జగన్ అవినీతి పరుడు అంటే ప్రజల్లో నాటుకోదని గతంలో తెలుగు దేశం పార్టీ నాయకులు వ్యూహాత్మకంగా 'లక్ష కోట్లు' అనే ప్రాపగాండా నడిపారు.సరిగ్గా అలాంటి ట్రిక్కే ఇది. ''ప్రజలు సత్యం తెలుసుకోవాలని ఎప్పుడూ అనుకోరు.ఎందుకంటే అది అప్పటివరకు వాళ్ళు నమ్ముతున్న కల్పితకథలను,నమ్మకాలను పటాపంచలు చేస్తుంది కాబట్టి''! అని తత్వవేత్త ఫ్రెడరిక్ నీషే అన్నాడు.ఆయన అన్నట్టుగానే నిజాలను వీలైనంతవరకు కప్పిపుచ్చి,అవి బయటకు రాకుండా చేసి గతంలో నమ్మిన 'కల్పిత కథల'నే అనేక కోణాల్లో ఆవిష్కరించే ప్రయత్నాల్లో 'ఎర్రవల్లి స్కిల్ యూనివర్సిటీ' తలమునకలై ఉన్నది.

> **'జగన్ లక్ష కోట్ల కుంభకోణం', 30 శాతం కమీషన్ రెండూ ఒకటే. వైఎస్.జగన్ అవినీతిపరుడు అంటే ప్రజల్లో నాటుకోదని గతంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వ్యూహాత్మకంగా 'లక్ష కోట్లు' అనే ప్రాపగాండా నడిపారు. సరిగ్గా అలాంటి ట్రిక్కే ఇది. ''ప్రజలు సత్యం తెలుసుకోవాలని ఎప్పుడూ అనుకోరు.ఎందుకంటే అది అప్పటివరకు వాళ్ళు నమ్ముతున్న కల్పితకథలను,నమ్మకాలను పటాపంచలు చేస్తుంది కాబట్టి''! అని తత్వవేత్త ఫ్రెడరిక్ నీషే అన్నాడు.ఆయన అన్నట్టుగానే నిజాలను వీలైనంతవరకు కప్పిపుచ్చి,అవి బయటకు రాకుండా చేసి గతంలో నమ్మిన 'కల్పిత కథల'నే అనేక కోణాల్లో ఆవిష్కరించే ప్రయత్నాల్లో 'ఎర్రవల్లి స్కిల్ యూనివర్సిటీ' తలమునకలై ఉన్నది.**

సామాన్య ప్రజలకు ఈ 'ఇంద్రజాల మహేంద్ర జాలం' అర్థం కాదు. కమీషన్లు తింటున్నారని జరుగుతున్న ప్రచారాన్ని నమ్మే అవకాశాలు ఎక్కువ. పైగా కేసీఆర్ కుటుంబ సభ్యులంతా 'తమ్మిని బమ్మి' చేయగలరు. వాళ్ళ వాక్చాతుర్యం,వాదనా పటిమను తట్టుకోవడం సులభం కాదు.ఒక్క రేవంత్ రెడ్డి మాత్రమే బిఆర్ఎస్ పార్టీ 'వాదనా పటిమ'ను తన శైలిలో ఢీకొనగలుగుతున్నారు. బిఆర్ఎస్ నాయకులు 'వంచనా శిల్పులు' అనే విమర్శలు చాలాకాలంగా ఉన్నవే. దళితబంధు పేరిట అడ్డగోలుగా డబ్బు పంచి,అందులో 'బినామీ'ల పేరిట పంటికి అందకుండా మింగివేసినా ఎవరికీ కనిపించ లేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకపోతే అసలు కేసీఆర్ హయాంలో జరిగిన అనేక బాగోతాలు బయటపడేవే కాదు. కేటీఆర్,హరీశ్ రావు తదితరులు బల్ల గుద్ది వాదిస్తున్నప్పుడు గోడకు సున్నంకొట్టినంత నిజం అనిపిస్తుంది.ఇలా కరెక్టుగా 'అతికినట్టు' మాట్లాడడం కేసీఆర్ 'స్కూల్' కే పరిమితమైన నైపుణ్యం. 'నిజం గడప దాటేలోగా అబద్ధం ప్రపంచం చుట్టి వస్తుంది' అనే మాట కేటీఆర్,హరీశ్ ల ఊతపదం.వాళ్లిద్దరే ఆ విద్యను అభ్యసించి అమలు చేస్తున్నారు. ప్రత్యర్థులపై బట్ట కాల్చివేయడం,బురద చల్లడంలో వాళ్లిద్దరూ నిపుణులే.అధికార కాంగ్రెస్ పార్టీలో,ప్రభుత్వంలో అలాంటి నైపుణ్యం ఉన్నవాళ్ళ కొరత తీవ్రంగా ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తోడుగా భట్టి, శ్రీధర్ బాబు, పొన్నం, కోమటిరెడ్డి తదితరులు ప్రతిపక్షాన్ని బలంగా ఢీకొంటున్నా, ఎందుకో బిఆర్ఎస్ ప్రచారమే ప్రజల్లో దూసుకుపోతున్న వాతావరణం కనిపిస్తోంది. ప్రధానస్రవంతి మీడియా సహా సోషల్ మీడియా మేనేజ్ మెంటులో ఇప్పటికీ బిఆర్ఎస్ ఆధిపత్యం స్పష్టంగా ఉంది. ఈ కారణంగానే అధికారపార్టీ ఎంత కష్టపడినా,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్ని 'సిక్సర్లు' కొట్టినా, కేటీఆర్ మేనేజ్ మెంటు నైపుణ్యం,ధనబలాన్ని అధిగమించలేక పోతున్నట్టు కనిపిస్తోంది.

తారక రామారావు మార్చి 26 న శాసనసభలో తెలంగాణ ప్రభుత్వంపై చేసిన తీవ్ర దుమారం రేపింది. ఆ వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తదితర అధికారపార్టీ సభ్యులు పట్టుబట్టడంతో సభా కార్యకలాపాలు నిలిచిపోయాయి. “మంత్రులు సంయమనం పాటించాలి. వారు ప్రతిపక్ష సభ్యుల మాట కూడా వినాలి. వారి సొంత ఎమ్మెల్యేలు దీనిని 30% కమిషన్ల ప్రభుత్వం అని పిలుస్తుండగా,సచివాలయంలో నిధుల మంజూరుకు 20% కమిషన్ గురించి చర్చ వినిపిస్తోంది ”అని కేటీఆర్ అన్నారు.అసెంబ్లీ కార్యక్రమాలు,నియమ నిబంధనలన్నింటినీ కాచివడబోసిన 'కోచ్' వలె,ఎంతో సీనియర్ రాజకీయ పండితుని వలె బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వ్యాఖ్యలున్నవి.

''బిఆర్ఎస్ ప్రభుత్వానికి సంబంధించిన ₹1 లక్ష కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండటం వల్ల కాంట్రాక్టర్లు ఇబ్బంది పడుతున్నారు.కేటీఆర్ ఇలాంటి అనుచిత ప్రకటనలు చేయకూడదు” అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. సభను, రాష్ట్ర ప్రజలను కేటీఆర్ తప్పుదారి పట్టిస్తున్నారని భట్టి ఆరోపించారు. "మేము వనరులను దోపిడీ చేయలేదు.రాష్ట్రాన్ని దోచుకోలేదు" అని ఆయన ఆరోపించారు.కేటీఆర్ వ్యాఖ్యలను రికార్డుల నుండి తొలగిస్తామని ప్యానల్ స్పీకర్ రేవూరి ప్రకాశరెడ్డి ప్రకటించారు.దీంతో హరీష్ రావు నేతృత్వంలో బిఆర్ఎస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి తమ అభిప్రాయాన్ని వివరించడానికి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు.బిఆర్ఎస్ సభ్యులకు మైక్ ఇవ్వడానికి స్పీకర్ నిరాకరించడంతో వాళ్ళు సభ నుంచి వాకౌట్ చేశారు. అధికారంలో ఉన్నా,ప్రతిపక్షంలో ఉన్నా కేసీఆర్ పార్టీ 'దబాయింపు' వైఖరితోనే పనిచేస్తుంది.అవతలివారిని ఆత్మరక్షణలో పడవేసే రీతిలో 'బుల్డోజ్' చేయడం ఎమ్మెల్యేలంతా కేసీఆర్ నుంచి శిక్షణ తీసుకున్నవారే.''ఆర్థిక మాంద్యమా బుద్ధి మాంద్యమా?అని ఒకసారి ''సభా నాయకుడికి అజ్ఞానం'' అని మరోసారి హరీశ్ రావు అవహేళన చేశారు.వాళ్ళ ప్రవర్తనా శైలి,మాటల దాడులు చూస్తుంటే వాళ్ళే అధికారంలో ఉన్నట్టుగా జనానికి అనుమానం కలుగుతుంది.

కేసీఆర్ హయాంలో బిల్లులు 40 వేల కోట్లకు పెండింగులో ఉన్న విషయాన్ని బిఆర్ఎస్ ఎక్కడా చెప్పదు. పనులు చేసినా వాటికి బిల్లులు ఇవ్వనిది కేసీఆర్ ప్రభుత్వమే. కేసీఆర్ హయాంలో దాదాపు 16 లక్షల 70 వేల 711కోట్లు పదేళ్లు ఖర్చు పెట్టారు.ఇన్ని వేల కోట్లు ఖర్చు చేసి ఏం చేసారన్న ప్రశ్న తలెత్తుతుంది.'' ఆ డబ్బుతో నాగార్జున సాగర్ కట్టారా? బీడీఎల్ కట్టారా?ఈసిఐఎల్ కట్టారా? అని భట్టి ప్రధానప్రతిపక్షాన్ని నిలదీశారు. తాము అధికారంలోకి వచ్చాక, రెండు లక్షల 80, 603 కోట్లు ఖర్చు చేశామని,ఇందులో జీతాలు 77..362 కోట్లు కాగా అప్పులకు కట్టినవి 88,009కోట్లు అని,లక్ష 34వేల కోట్లు పథకాల కోసం ఖర్చు చేశామని ఆర్థికమంత్రి తెలిపారు. ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం 2,80,603 కోట్లు కాగా, ఖర్చు 2 లక్షల 99.421 కోట్లు అని ఆయన వివరించారు. పదేళ్లలో లక్ష ఇండ్లు కూడా కట్టలేదని చెప్పారు.

పర్సంటేజీలను కేటీఆర్ నిరూపించాలని డిప్యూటీ సీఎం చాలెంజ్ చేశారు.లేదంటే సభకు,రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండు చేశారు. సభలో మాట్లాడేటప్పుడు నిబద్ధతతో, ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని,రాష్ట్రంపై పడి అడ్డగోలుగా దోచుకున్నారని భట్టి నిప్పులు చెరిగారు. ''మీరు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. సభ్యులు మాట్లాడేటప్పుడు ఒళ్ళు దగ్గర పెట్టుకునే మాట్లాడాలి. ఏది మాట్లాడితే అది చెల్లుబాటు కాదు. కేసీఆర్ హయాంలో పనులు చేసిన వాళ్లు బిల్లులు రాక సెక్రటేరియట్ చుట్టూ తిరుగుతున్నారు.పది సంవత్సరాలు గత బిఆర్ఎస్ ప్రభుత్వం పెట్టిన బడ్జెట్ చేసిన అప్పు మొత్తం 16,70,711కోట్లు ఖర్చు చేసి రాష్ట్రంలో ఏలాంటి ఆస్తులు సృష్టించలేదు. కాళేశ్వరం కట్టామని బిఆర్ఎస్ గొప్పగా చెప్పుకుంది. ఇప్పుడు దాని పరిస్థితి ఏంటో చూశాం. బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో గ్యాప్ రావడం వల్ల సంక్షేమ పథకాలకు కేటాయించిన నిధులకు కోత పడటం వల్ల ఆ వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున నష్టపోయారు.తెలంగాణ రాష్ట్ర తెచ్చుకున్నదే యువత కోసం.మేము అధికారంలోకి రాగానే 58 వేల పైగా ఉద్యోగాలు ఇచ్చాం.ఉద్యోగాలు రాని ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ యువతకు స్వయం ఉపాధి పథకాల అందించడానికి రాజీవ్ యువ వికాసం పథకం కింద 6000 కోట్ల కేటాయించాం. ఈడబ్లుఎస్ యువతకి కూడా స్వయం ఉపాధి పథకాల అందించడానికి ఈ బడ్జెట్ లో 600 కోట్లు కేటాయించాం. బ్రాహ్మణ పరిషత్ కు 50కోట్లు కేటాయించడమే కాకుండా స్వయం ఉపాధి పథకాల కోసం మరో 50 కోట్లు అదనంగా కేటాయించాం''అని ఉపముఖ్యమంత్రి భట్టి వివరించారు. ''కేసీఆర్ సర్కార్ హయాంలో రూ.50 లక్షల కోట్ల సంపదను బిఆర్ఎస్ ప్రభుత్వం సృష్టించింది.వడ్డించిన విస్తరిలా కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో అన్నీ పెట్టాం. దేశానికే టార్చ్ బేరర్ అయిన తెలంగాణ జ్యోతిని ఆరిపోనివ్వబోము'' అని 2023 డిసెంబర్ లో తెలంగాణ భవన్లో కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తూ చెప్పారు.''రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కేసీఆర్ పాలనను బద్నాం చేసే ప్రయత్నం చేసింది. కోట్లాది మంది చెమటతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకున్న తీరును వివరించేందుకే స్వేదపత్రం విడుదల చేసాం. శ్వేతపత్రాల పేరిట అభాండాలు వేస్తున్నారు.పెట్టిన ఖర్చు కంటే పెరిగిన సంపద రాష్ట్రంలో పదుల రెట్లు అయింది.తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల సమష్టి సంపద.ఎక్కువ వేతనాలు,ఉద్యోగాలు ఇచ్చి చెప్పుకోలేక పోయాము.ఓటమి మాకు కేవలం స్పీడ్ బ్రేకర్ మాత్రమే''.అని కూడా కేటీఆర్ అన్నారు.

50 కోట్ల సంపదను నిజంగానే కేసీఆర్ సృష్టించి ఉంటే,అది ప్రజలకు అందుబాటులోకి రాకుండా ఎటు పోతుంది?ప్రజల అనుభవంలోకి రాకుండా ఆ సంపద ఏమైనట్టు? 4కోట్ల జనాభాలో ఇంకా దాదాపు కోటి మంది దాకా దారిద్ర్యరేఖకు దిగువన ఎందుకు ఉన్నట్టు?తెల్ల రేషన్ కార్డుల కోసం ఇంకా కుప్పలుతెప్పలుగా దరఖాస్తులు ఎందుకు వెల్లువెత్తుతున్నట్టు ?ప్రజల జీవన ప్రమాణాల్లో అనూహ్యమైన పెరుగుదల కనిపించాలి కదా! కేటీఆర్ చెబుతున్న లెక్కలు వింటుంటే,మనమెక్కడో స్వర్గంలోనో,దరిద్రులు కనిపించని మరో లోకంలోనో ఉన్నట్టు కొన్ని క్షణాలు భ్రమల్లో మునిగిపోతాం.హైదరాబాద్ మహానగరం ,దాని పరిసరాల్లోనే 1000 మంది దగ్గర 20 లక్షల కోట్ల డబ్బులు నిల్వ ఉన్నట్టు కేంద్రప్రభుత్వం ప్రకటించిన గణాంకాల మాటేమిటి?ఆ వెయ్యిమంది ఎవరు? 50 కోట్ల సంపదలో వాళ్లకు 'వాటా' వెళ్లిందా? ఈ విషయాలు మన తర్కానికి అందేవి కావు.మనం 80 వేల పుస్తకాలయినా చదివి ఉండాలి,లేదా అలాంటి 'విద్యా సంపన్నుడి' వారసులమైనా అయి ఉండాలి.

# సత్ఫలితాలనిస్తున్న శుక్రవారం సభ

■ తగ్గుతున్న లోప పోషణ చిన్నారుల సంఖ్య
■ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, మహా డైలీ :** మహిళలు, చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన శుక్రవారం సభ సత్ఫలితాలను ఇస్తోందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. రామడుగు మండలం కొక్కెరకుంట అంగన్వాడి కేంద్రం ఆవరణలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభ నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ శుక్రవారం సభ నిర్వహణపై మహిళలకు అవగాహన వచ్చిందని, తద్వారా చిన్నారులు లోప పోషణ, మహిళల్లో రక్తహీనత తగ్గుముఖం పడుతోందని అన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్న ఆలోచనతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. కొక్కెరకుంట గ్రామంలో 71 మంది చిన్నారులు ఉండగా కేవలం ఆరుగురు పిల్లలకు మాత్రమే లోప పోషణ ఉందని తెలిపారు. వారిని కూడా సాధారణ స్థితికి తెస్తామని తెలిపారు. శుక్రవారం సభ ద్వారా సాధారణ ప్రసవాల పట్ల మహిళలకు అవగాహన పెరిగిందని అన్నారు. తమ పిల్లల లోప పోషణ, ఎత్తుకు తగిన బరువు ఉండడం వంటి అంశాలను తల్లిదండ్రులు ఈ సభ ద్వారా తెలుసుకొని పిల్లలకు బలమైన ఆహారం ఇస్తున్నారని తెలిపారు.

ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలను చేర్పించి డబ్బు వృధా చేయకూడదని, కార్పొరేట్ కు ధీటుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అంగన్వాడీలో పిల్లలను చేర్పించాలని సూచించారు. రానున్న విద్యా సంవత్సరంలో కొక్కెర కుంట అంగన్వాడీ నమోదును పెంచాలని తెలిపారు. గర్భిణీగా ఉన్న సమయంలో టిఫా స్కానింగ్ చాలా ముఖ్యమైనదని అన్నారు. మేనరిక వివాహాల వల్ల కలిగే అనర్థాలను తెలుసుకొని వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి మహిళ క్యాల్షియం, ఐరన్ మాత్రలను తీసుకోవాలని, అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ మాత్రలు అందుబాటులో ఉంటాయని అన్నారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు ప్రభుత్వ ఆసుపత్రిలో మాత్రలు ఉచితంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కొక్కరకుంట అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి గర్భిణీ, బాలింతల నమోదు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కే సబితా కుమారి, జిల్లా వైద్యాధికారి వెంకట రమణ, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, సిడిపిఓ నర్సింగారాణి పాల్గొన్నారు.

# మహా ఎఫెక్ట్..!

■ మేళ్ళ చెరువు ఆర్ఐ పై వేటు..!!
■ మోసిన్ బాబా ను విధుల నుండి తొలగించిన తహశీల్దార్ జ్యోతి

**మేళ్ళ చెరువు, మహా డైలీ :** నిర్లక్ష్యానికి, అవినీతికి కేరాఫ్ గా ఆరోపణలు ఎదుర్కొంటున్న సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు రెవన్యూ ఇన్స్ పెక్టర్ మోసిన్ బాబాపై వేటుపడింది. ఆర్ఐ అవినీతి ఆరోపణలపై మహా పత్రికలో ప్రత్యేక కథనం ప్రచురితం కాగా, జిల్లా ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. ఆర్ఐ మోసిన్ బాబా ప్రవర్తన పై పలుమార్లు హెచ్చరించినా మార్పురాలేదని, మహా పత్రికలో అతనిపై ఉన్న ఆరోపణలు ప్రచురితం కావడంతో తహశీల్దార్ జ్యోతి చర్యలు తీసుకున్నారు. మేళ్ళ చెరువు తహసిల్దార్ కార్యాలయంలో ఆర్ ఐ గా పనిచేస్తున్న మోసిన్ బాబా పలు అవినీతి ఆరోపణలతో పాటు రాజీవ్ యువ వికాసం పథకం అప్లై కోసం వచ్చిన మహిళల తో కూడా అసభ్యకరంగా ప్రవర్తించాడు అంటూ ఆరోపణలు వచ్చాయి. ఇటీవల కాలంలో స్థానిక మండల కేంద్రానికి చెందిన కొందరి దగ్గర లంచం తీసుకున్నట్లు కొన్ని వాస్తవ విషయాలు ఉన్నాయనీ ఇదే విషయాన్ని మేళ్లచెరువు రెవిన్యూ శాఖలో అవినీతి చాపకింద నీరులా విస్తరిస్తోందన్న శీర్షికతో కథనం ప్రచురించడంతో ఆర్ఐ మోసిన్ బాబా అక్రమానికి అడ్డు కట్ట పడింది. ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ ప్రజలను బురిడీ కొట్టిస్తూ డబ్బులు దండుకుంటున్న అవినీతి ఆర్ఐ పై మహా పత్రిక కథనం వెలుగు లోకి తీసుకొచ్చి ప్రచురించడంతో ఎట్టకేలకు వేటుపడింది. ప్రజల పక్షాన నిలిచి నిర్లక్ష్యపు అధికారి బండారం బయటపట్టిన మహా పత్రికను స్థానికులు అభినందించారు.






తహసీల్దార్ పి. జ్యోతి (ఫైల్ ఫోటో)



ఆర్ఐ మోసిన్ బాబా (ఫైల్ ఫోటో)

# రాజీవ్ యువ వికాసం పథకంతో యువతకు ఉపాధి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా డైలీ :** తెలంగాణ రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పరచాలనే ఉద్దేశంతో రాజీవ్ యువ వికాసం కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర తెలంగాణ కమ్యూనిటీ పారామెడికల్ వైద్యుల ఐక్య వేదిక అధ్యక్షులు ఉక్కుల అశోక్ అన్నారు.. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనారిటీ యువతను ఆర్థికంగా బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆకాంక్షిస్తుందని అన్నారు. ఈ కారణంగానే రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో 1,50,000 వరకు ఆదాయం కలిగి ఉండాలని అర్బన్ ప్రాంతంలో రెండు లక్షల వరకు ఆదాయం ఉండవచ్చని ప్రభుత్వం తెలిపిందన్నారు. ప్రజా ప్రభుత్వం రాజీవ్ వికాసం పథకం యొక్క మార్గదర్శకాలు విడుదల చేసింది. కావున అర్హులైన యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఏప్రిల్ 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉక్కుల అశోక్ కోరారు.

# జిల్లా వైద్యారోగ్యశాఖలో ఏసీబీ దాడులు

■ లంచం తీసుకుంటూ పట్టుబడిన డీఈఎంఓ



**ఆదిలాబాద్, మహా డైలీ :** మెడికల్ షాపు యజమాని నుండి వైద్యారోగ్యశాఖ జిల్లా మాస్ మీడియా అధికారి రవిశంకర్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు చిక్కారు. లంచం ఇచ్చే సమయంలో రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న అధికారులు...సిలికాన్ టెస్టు జరిపి నిర్ధారించారు. సదరు అధికారి ఏసీబీకి చిక్కడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఇటీవల గుడిహత్నూర్ మండలకేంద్రంలో ఓ మహిళకు అబార్షన్ చేసి ఆమె మృతికి కారణమైన కేసులో మందులు ఇచ్చిన మెడికల్ షాపు యజమానిని కేసు నుండి తప్పించేందుకు అధికారి లక్ష రూపాయలు డిమాండ్ చేసినట్లు ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా... శుక్రవారం ముప్పై వేల రూపాయలు అధికారికి ఇస్తున్న సమయంలోనే దాడి చేసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. సిలికాన్ పరీక్ష నిర్వహించిన అనంతరం సొమ్మును స్వాధీనం చేసుకుని అధికారి రవిశంకర్ ని అరెస్టు చేశారు.

# బీజేపీ కుట్రను ఎండగడదాం

■ సీసీఐను తిరిగి తెరిపిద్దాం
■ అంతవరకు ఉద్యమిద్దాం
■ ఆదిలాబాద్ పర్యటనలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



**ఆదిలాబాద్, మహా డైలీ :** ఆదిలాబాద్‌లోని ఏకైక పరిశ్రమను మూసివేసి తుక్కుకింద అమ్మేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని, దీనికింద ఉన్న భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని చూస్తోందని, ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. వంద సంవత్సరాలకు సరిపడా ముడిసరుకు, అన్నిరకాల వనరులు ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించకుండా ప్రయివేటు వ్యక్తులకు అప్పజెప్పేందుకు కుట్రపన్నుతోందని ధ్వజమెత్తారు. జిల్లా పర్యటనలో భాగంగా సీసీఐ సిమెంట్ పరిశ్రమను సీసీఐ సాధన సమితి సభ్యులు, సీపీఎం నాయకులు, ప్రజా, కార్మిక సంఘాల ప్రతినిధులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. వీరిని లోపలికి అనుమతించకుండా సీసీఐ అధికారి అడ్డుకోవడంతో స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం పోలీసుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ... బీజేపీ స్థానిక ఎమ్మెల్యే, ఎంపీల ఆధ్వర్యంలో భూములు రియల్ ఎస్టేట్ చేసి కోట్ల రూపాయలు గడించాలని కుట్ర సాగుతోందన్నారు. సీసీఐను తిరిగి తెరిపించే వరకే సాగే ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం పట్టణంలోని ప్రధాన కూడళ్లగుండా కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. సీసీఐ పునరుద్ధరణపై సీసీఐ సాధన సమితి ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న దీక్షలకు జాన్ వెస్లీ సంఘీభావం తెలిపారు. దీక్షా శిబిరాన్ని సందర్శించి సంపూర్ణ మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ఆనాడు ఎన్నికల వేళ సీసీఐ పరిశ్రమను తెరిపిస్తామంటేనే జిల్లా ప్రజలు ఓటేసి బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేను గెలిపించారని, తీరా ఇప్పుడు పునరుద్ధరించకపోగా తుక్కుకింద అమ్మేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని, ఈ మోసపూరిత వైఖరిపై ప్రజలు తిరగబడాల్సిన అవసరం ఉందని జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. బీజేపీ అవలంభిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను తప్పుబట్టారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను బీజేపీ మరిచిపోయిందన్నారు. సీసీఐ విషయంలోనూ అదే జరుగుతోందన్నారు. ఆనాడు సీసీఐ పరిశ్రమను మూసింది బీజేపీయేనని, మళ్లీ తెరిపిస్తామని చెప్పింది కూడా బీజేపీయేనన్నారు. ఈ డ్రామాను ప్రజలు అర్థం చేసుకుని ఐక్య పోరాటాలకు సన్నద్ధం కావాలన్నారు. కేంద్రంలోని బీజేపీ దేశ సంపదను అంబానీ ఆదానీలకు దోచిపెడుతోందని మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల , ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే జర్నలిస్టులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి



**మోత్కూర్, మహా డైలీ :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో పాత్రికేయులకు స్థానిక ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు ఇండ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు, ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, ఇచ్చే వరకు జర్నలిస్టుల పోరాటానికి సిపిఎం పార్టీ అండగా ఉంటుందని, మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. మండల కేంద్రంలో జర్నలిస్టులు చేస్తున్న ధర్నాకు సిపిఎం పార్టీ మండల కమిటీ మద్దతు తెలిపారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి, మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు మాట్లాడుతూ. పాలక ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు ఉచ్చితంగా వేలాది ఎకరాలు ఇస్తున్నాయి కాని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేసే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకపోగా, ఇచ్చిన స్థలాన్ని సమస్య పరిష్కరించి వారికి కేటాయించడంలో స్థానిక ఎమ్మెల్యే మీనమేషాలు లెక్కిస్తునారని విమర్శించ్చారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంబమైన మీడియా తన న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతుంటే పట్టించుకోక పోవడంపై, ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ తక్షణమే స్పందించి న్యాయమైన సమస్యను పరిష్కరించి ఇండ్ల స్థలాలు ఇప్పించాలని, ఆయన ఇచ్చిన హామీ మేరకు ఇండ్లు కూడ కట్టించి ఇవ్వాలని కోరారు. న్యాయమైన వారి సమస్యలు ప్రభుత్వం పరిష్కరించి ఇండ్ల స్థలాలు ఇచ్చే వరకు వారి పోరాటానికి సిపిఎం పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, కురిమేటి యాదయ్య, పిట్టల చంద్రయ్య, వెండి యాదగిరి, దడిపల్లి సైదులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించాలి




**మోత్కూర్, మహా డైలీ :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో గ్రామాలలో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించాలని, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, పెంచిన పెన్షన్ వెంటనే అమలు చెయ్యాలని, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. పార్టీ పిలుపు మేరకు పోరు యాత్రలో భాగంగా గ్రామాలలో నెలకొన్న సమస్యలపై మోత్కూర్ మండల, టౌన్ కమిటీల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి డిప్యూటి తహసీల్దార్ ఉపేందర్, కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం బొల్లు యాదగిరి మాట్లాడుతూ. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అనేక వాగ్దాలు చేసి అధికారంలోకి వచ్చిందని, వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలం అవుతుందని విమర్శించ్చారు. గ్రామాలలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రోడ్లు, మురికి కాల్వలు లాంటి అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బునాది గానికాల్వా నిర్మాణ పనులకు నిధులు కేటాయించినట్లు ప్రకటన చేసిన, ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, పట్టణ కార్యదర్శి రాచకొండ రాములమ్మ, మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, పైళ్ల రాంరెడ్డి, కురిమేటి యాదయ్య, మెతుకు అంజయ్య, బండి రవి, వెండి యాదగిరి, పాటి శ్రీనివాస రెడ్డి, పిట్టల చంద్రయ్య, దడిపల్లి సైదులు, గుండు లక్ష్మి, సహారా, సావిత్రి,యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది పంచాంగాన్ని ఆవిష్కరించిన మంత్రులు




**మేడిపల్లి, మహా డైలీ :** వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూ జే ఐ) రూపొందించిన శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పంచాంగం, దైనందినిని రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు శుక్రవారం ఆవిష్కరించారు. హైదరాబాద్ లోని మినిస్టర్ క్వార్టర్స్ లో డబ్ల్యూ జే ఐ ప్రతినిధులు వారిని కలిసి జర్నలిస్టుల సంక్షేమానికి యూనియన్ చేపట్టిన, చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. సమస్యల పరిష్కారానికి సహకరించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా మంత్రులు పాత్రికేయులకు, ప్రజలకు తెలుగు వత్సర శుభాభినందనలు తెలిపారు. సమస్యలపై పోరాటంలో తాము జర్నలిస్టుల వెంట కలిసి నడుస్తామని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడు సంజయ్ ఉపాధ్యాయ, ప్రధాన కార్యదర్శి నరేంద్ర భండారి, సీనియర్ ఉపాధ్యక్షుడు సంజయ్ సక్సేనాలు తమ సందేశాల్లో పేర్కొన్నారు. తెలుగు ప్రజలకు, పాత్రికేయులకు వారు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. పంచాంగం, దైనందిని ఆవిష్కరణ కార్యక్రమంలో డబ్ల్యూ జే ఐ రాష్ట్ర అధ్యక్షుడు నందనం కృపాకర్, అధ్యక్షుడు రాణాప్రతాప్ రజ్జూభయ్యా , ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, కార్యదర్శి క్రాంతి ముదిరాజ్, నగర అధ్యక్షుడు బాలకృష్ణ పాల్గొన్నారు.

# రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవాలి




**ములుగు, మహా డైలీ :** సమాజంలో ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ పిలుపునిచ్చారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, అదనపు కలెక్టర్ ఎం.సంపత్ రావు ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తలసేమియా బాధితుల కోసం ఏర్పాటుచేసిన ఈ శిబిరాన్ని గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, అదనపు కలెక్టర్ (రెవిన్యూ) సిహెచ్.మహేందర్ జీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ రవిచందర్ మాట్లాడుతూ తలసేమియా బాధితుల కోసం మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. రక్తదానం ద్వారా మరో ప్రాణాన్ని నిలబెట్టవచ్చని, ప్రతీ మూడునెలలకు ఒకసారి రక్తమార్పిడి జరిగితే ఆరోగ్యానికి మంచిదన్నారు. ఈ సందర్భంగా రక్తదాతలకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ శిబిరంలో 280యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు అధికారులు వెల్లడించారు. రక్తదాతలకు ములుగు లయన్స్ క్లబ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు అరటి పండ్లు, మినరల్ వాటర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో టీజీవో అసోసియేట్ ప్రెసిడెంట్ కె. రామకృష్ణ, సెక్రెటరీ కందుల జీవన్ కుమార్, ట్రెజరర్ ప్రకాష్‌రెడ్డి, టీఎన్జీవోస్ అధ్యక్షుడు పూలు రాజు, సెక్రెటరీ చైతన్య, నాయకులు ఏండి.రఫీక్, జవహర్ రెడ్డి, శిరీష, రాజు, దేవరాజ్, శైలజ, దుర్గారావు, జవహర్ రెడ్డి, బాలయ్య, నరసింహ, రాజేశ్వరరావులతోపాటు ఉపాధ్యాయ సంఘాలు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, సిఆర్పిఎఫ్, 5వబెటాలియన్, సివిల్ పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ సవరణ బిల్లు కు నల్ల బ్యాడ్జి లతో ముస్లింల నిరసన



**కాటారం, మహా డైలీ :** వక్ఫ్ సవరణ బిల్లు 2024కి నిరసనగా రంజాన్ చివరి శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అల్విదా జుమా నాడు దేశవ్యాప్తంగా ఉన్న ముస్లింలు చేతికి నల్లటి బ్యాండ్లు ధరించాలని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఎఐఎంపిఎల్‌బి) పిలుపు మేరకు కాటారం ముస్లింలు శుక్రవారం మధ్యాహ్నం మస్జిద్ కు నల్లటి బ్యాడ్జీలు ధరించి హాజరయ్యారు. ఈ సందర్భంగా గారేపల్లి మస్జిద్ ప్రెసిడెంట్ షేక్ అమీర్ మాట్లాడుతూ ..ఈ బిల్లు ముస్లింల మసీదులు, ఈద్గాలు, మదర్సాలు, దర్గాలు, ఖాన్ఖాలు, స్మశానవాటికలు, ధార్మిక సంస్థలను లాక్కునేందుకు ఉద్దేశించిన కపటకుట్రగా పేర్కొన్నారు. ఈ బిల్లుని వ్యతిరేకించడం దేశంలోని ప్రతి ముస్లిం బాధ్యత అని అన్నారు. జుముఅతుల్ విదా ఉన్నందున మసీదుకు వచ్చే సమయంలో ముస్లింలందరూ నల్లటి బ్యాండ్ ధరించి శాంతియుతంగా ,మౌనంగా నిరసన తెలపడం జరిగిందన్నారూ. ఈ కార్యక్రమంలో మత పెద్దలు ,ముస్లిం సోదరులు, యువత తదితరులు పాల్గొన్నారు.

# భీమ సౌకర్యాన్ని సద్వినియో చేసుకోవాలి




**మోత్కూర్, మహా డైలీ :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోనీ భీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి, మన గ్రోమోర్ కేంద్రం, ఐసిఐసిఐ బ్యాంకు ఒప్పందంతో ఇచ్చే వ్యక్తిగత భీమా సౌకర్యాన్ని మండల ప్రజల సద్వినియోగం చేసుకోవాలని మన గ్రోమోర్ మేనేజర్ హరిబాబుగౌడ్ కోరారు. మండల కేంద్రంలోని గ్రోమోర్ కేంద్రం వద్ద విలేకరులతో మాట్లాడుతూ రైతులతో పాటు సామాన్య ప్రజలు కూడా 18 సంవత్సరాల నుండి 65 సంవత్సరాల వయస్సు వరకు అర్హులని తెలిపారు. సంవత్సరానికి కేవలం 100 రూపాయలు చెల్లిస్తే రోడ్డు చాలు ప్రమాదం, పిడుగుపాటు, పాము కాటు, విద్యుత్ షాక్ వంటి నాలుగు విదాలుగా ప్రమాదం జరిగి మరణిస్తే రెండు లక్షల రూపాయలు మన గ్రోమోర్ సెంటర్ చెల్లిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రోమోర్ సిబ్బంది హరిబాబు, అనేష్ రెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

# అంతర్ రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు



**తొర్రూర్, మహా :** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలో పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లో తనిఖీల సందర్భంగా మహారాష్ట్రకు చెందిన ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి సుమారు 9 కేజీల గంజాయి పట్టుబడింది. ఈ ఘటనపై తొర్రూరు ఎస్సై ఉపేందర్ స్పందిస్తూ, ఒడిశా రాష్ట్రం నుండి మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తుండగా వీరిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని తెలిపారు.

# ఇద్దరి భామల మెడలో తాళికట్టిన యువకుడు



**ఆదిలాబాద్ మహా :** ఒకే పెళ్లి మండపంలో ఇద్దరు అమ్మాయిలను వివాహం చేసుకున్నాడు ఓ యువకుడు. అంతే కాదండి ముందుగానే శుభ లేఖలను కూడా ఆ ఇద్దరు యువతులను పెళ్లి చేసుకుంటున్నట్లు అచ్చు వేయించాడు. 500 మంది అతిథుల సమక్షంలో ఆ ఇద్దరి మెడలో తాళి కట్టాడు. ఆ భార్యాభర్తలను వచ్చిన అతిథులందరూ ఆశీర్వదించారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని లింగాపూర్ మండలం గుమ్నూర్ గ్రామంలో జరిగిన ఈ పెళ్లి ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పెళ్లి ఫోటోలతోపాటు శుభలేఖ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఆ యువకుడు ఇద్దరు యువతులతోనూ ప్రేమలో పడటం.వాళ్లు కూడా కలిసి జీవించడానికి నిర్ణయించుకున్నారు.ఇంకేముంది విషయం పెద్దవాళ్లకి చెప్పడం వారంతా ఒప్పుకోవడంతో ఒకే వేదికపై ఈ పెళ్లి తంతు జరగడం విశేషం. మరో విషయమేంటంటే ఇద్దరిని చాలా బాగా చూసుకుంటానని ఎవరికి ఏ ఇబ్బంది రాకుండా చూసుకుంటానని బాండు కూడా రాసిచ్చి మరీ తాళి కట్టాడట పెళ్లి కొడుకు . మొత్తానికి ఇద్దరమ్మాయిలతో మూడేళ్ల కిందట మొదలైన అతడి ప్రేమకథకు ఇలా శుభం కార్డు పడింది.

# ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియను వేగవంతం చేయాలి

- పూర్తయిన ఇండ్లకు తక్షణమే చెల్లింపులు
- త్రాగునీటి సమస్య ఏ గ్రామంలోనూ రాకూడదు
- జూన్ చివరికి వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులు పూర్తి కావాలి
- మడికొండ డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం
- మంత్రి, వరంగల్ జిల్లా ఇన్ ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**వరంగల్, మహా ;** పైలట్ గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, బేస్‌మెంట్ పూర్తయిన ఇండ్లకు తక్షణం చెల్లింపులు జరపాలని వరంగల్ జిల్లా ఇన్ ఛార్జి , రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో వరంగల్ స్మార్ట్ సిటీ పనులు , వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, త్రాగునీరు, ఇందిరమ్మ ఇండ్లు తదితర అంశాలపై పంచాయితీ రాజ్ శాఖ మంత్రి శ్రీమతి ధనసరి అనసూయ సీతక్క, అటవీ , దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్య మంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డితో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా శాసనసభ్యులు, కలెక్టర్లు, వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఈ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతా అంశమని దీనిని దృష్టిలో పెట్టుకొని కలెక్టర్లు పనిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ప్రభుత్వం నాలుగు విడతలలో చెల్లింపులు చేస్తుందని, మొదటి విడతలో బేస్ మెంట్ లెవెల్ పూర్తయిన ఇండ్లకు లక్ష రూపాయిలు ఇస్తుందని, బేస్ మెంట్ పూర్తయిన ఇండ్ల వివరాలను హౌసింగ్ విభాగానికి పంపిస్తే తక్షణమే చెల్లింపులు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో ఇండ్ల స్థలాలు లేని అర్హత కలిగిన లబ్దిదారులకు ఇప్పటివరకు కేటాయించని 2 బిహెచ్‌కే ఇండ్లను కేటాయించాలని అలాగే మొండి గోడలతో ఉన్న ఇండ్లను పూర్తిచేయడానికి కాంట్రాక్టర్ ముందుకు రాని పక్షంలో లబ్దిదారులే ఆ ఇండ్లను పూర్తిచేసుకోవడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని లబ్దిదారులను ఎంపిక చేసి ఇండ్లను కేటాయించాలని సూచించారు. వేసవి కాలంలో ఏ గ్రామంలో పట్టణంలోగానీ త్రాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా జిల్లా కలెక్టర్లు ఈ అంశానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అధికారులతో సమన్వయం చేసుకొని అధికారులు వారంలో మూడు రోజులు గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. వచ్చే మూడు నెలలు చాలా కీలకమని ప్రజలకు ఎక్కగా త్రాగునీటి గురించి ఇబ్బంది కలగకుండా నీళ్లు రావడం లేదన్న విమర్శ రాకుండా పనిచేయాలన్నారు. నీటికొరత ఉన్న ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా త్రాగునీరు సరఫరా చేయడం, చెడిపోయిన బోర్లు, హ్యాండ్ పంప్ లను తక్షణం మరమ్మతులు చేపట్టాలని సూచించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవన నిర్మాణ పనులను రెండు నెలల్లో పూర్తిచేసి ఆ తర్వాత మరో నెలరోజుల్లో వైద్య సేవలకు అవసరమైన పరికరాలను అమర్చి జూన్ చివరినాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలి. ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. మడికొండ డంపింగ్ యార్డు సమస్యకు వారం రోజుల్లో తాత్కాలిక పరిష్కారం చూపించి ఆ తర్వాత శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దీనికి సంబంధించి సిడిఎంఎ డైరెక్టర్ శ్రీదేవిని స్వయంగా అక్కడ పర్యటించి పరిష్కార మార్గాలను సూచించాలని ఆదేశించారు. వరంగల్, కరీంనగర్ రహదారి ప్రాంతంలో శాశ్వత డంపింగ్ యార్డు కోసం 150 నుంచి 200 ఎకరాల భూమిని సేకరించాలని కలెక్టర్లను ఆదేశించారు. వరంగల్ భద్రకాళి చెరువు పూడికతీత పనులను ఎట్టిపరిస్థితులలోను వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు పూర్తిచేయాలన్నారు. వరంగల్ స్మార్ట్ సిటీ పనుల విషయంలో అధికారులు ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో శాసనసభ్యులు కడియం శ్రీహరి, నాయని రాజేందర్, యశస్విని రెడ్డి, దొంతి మాధవరెడ్డి, నాగరాజు, మురళీనాయక్, రామచంద్ర నాయక్, రేవూరి ప్రకాష్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, ఆర్ అండ్ బి సెక్రెటరీ హరిచందన, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ కర్ణన్, ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, ప్రావీణ్య, షేక్ రిజ్వాన్ బాషా, దివాకరా టి ఎస్, అద్వైత్ కుమార్, రాహుల్ శర్మ, జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖేడ్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా :** మంచాల మండలంలో పలు అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే రంగారెడ్డి శంకుస్థాపనలు చేశారు. శుక్రవారం పిఏసిఎస్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బ్యాంక్ చైర్మన్ వ్యతిరే వెదిరే హనుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సహకార సంఘం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. మంచాల మండలం, ఆరుట్ల గ్రామంలో సుమారు 50 లక్షల రూపాయలతో, అధునాతన హంగులతో నిర్వహించబోయే కూరగాయల మార్కెట్ కు, నోముల గ్రామంలో ఉన్న సహకార సంఘం భవనానికి చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం పనులకు, ఏఎంసీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్లు హనుమంత్ రెడ్డి పాండురంగా రెడ్డి, మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారినిలతో కలిసి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి శంకుస్థాపనలు చేశారు. సహకార సంఘం బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ...సహకార సంఘం అంటేనే ప్రజలకు రైతులకు సేవా కార్యక్రమాలు చేయడానికి ఈ సహకార సంఘాలు ఉంటాయి. ఆరుట్ల గ్రామంలో సుమారు 50 లక్షల రూపాయలతో మార్కెట్ కూరగాయల మార్కెట్ ను నిర్మించుకోవడం సంతోషంగా ఉందన్నారు. పిఏసిఎస్ ఆధ్వర్యంలో రైతులకు రుణాలు అందజేసి వాళ్ళ అభివృద్ధికి తోడ్పాటుగా ఉంటుందని సహకార సంఘాలతో ప్రజలకు రైతులకు స్నేహపూర్వక సంబంధం ఉంటుందన్నారు. సహకార సంఘాల బ్యాంకుల ద్వారా రైతులు ప్రజలు రుణాలు తీసుకొని ఉపాధి పొందాలని తెలిపారు.

# జిల్లా కలెక్టర్ పై జాతీయ ఎస్సీ కమిషన్కు ఫిర్యాదు



**కాటారం, మహా :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పై జాతీయ ఎస్సీ కమిషన్ కు కాటారం గ్రామానికి చెందిన రామిళ్ళ రాజబాబు శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. కాటారం గ్రామ నివాసి రామిల్ల రాజబాపు తండ్రి రామిల్ల మల్లయ్య కౌలు రైతు ఆత్మహత్య ఎక్స్ గ్రేషియా చెక్కుల పంపిణీ, లిస్టులో జరిగిన అవకతవకల పై భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ను సోమవారం ప్రజావాణిలో వివరణ అడగగా పూర్తి వివరాలు అర్థమయ్యే విధంగా వెల్లడించాల్సిన కలెక్టర్ మాపట్ల దురుసుగా ప్రవర్తించి అసహనం వ్యక్తం చేసిన విషయం, కలెక్టర్ వ్యవహార శైలిపై, సి ఎం ఆర్ ఎఫ్ చెక్కుల విషయంలో ఎక్స్గ్రేషియా ఇప్పించాల్సిన విషయంలో, బాధితుడు రామిల్ల రాజబాపు జాతీయ ఎస్ సి కమిషన్ డైరెక్టర్ సునీల్ కుమార్ కు న్యాయం చేయాలని దరఖాస్తు ఇచ్చినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

# ఆధునిక పద్ధతుల్లో బోధనతో విద్యార్థుల్లో నూతనోత్సాహం




**ములుగు, మహా :** ప్రస్తుతం ఏఐ ద్వారా ప్రపంచంలో కొత్త ఒరవడి సాగుతోందని, ఆధునిక పద్ధతుల ద్వారా బోధన జరిగితే విద్యార్థుల్లో నూతనోత్సాహం కలుగుతోందని జిల్లా విద్యా శాఖ అధికారి జి.పాణిని అన్నారు. ఏఐతో తొలిమెట్టు లక్ష్యాల సాధన సులభతరం అవుతుందని పేర్కొన్నారు. ములుగు మండలం పత్తిపల్లి పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పద్ధతిలో విద్యాబోధనను డీఈవో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వం సంకల్పం గొప్పదని, నూతన పద్ధతులతో బోధన చేయడంతో పోటీ తత్వం పెరుగుతుందన్నారు. ఏఐ ల్యాబ్ ను ఉపయోగించుకొని స్వీయ అభ్యసన జరిగేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ఏఐ బోధనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలత, డీఆర్పీ మాతంగి మధు, ఉపాధ్యాయులు గౌరిశెట్టి శివ ప్రసాద్, వైనాల స్వామి, పాడియా రవి, మురళి, శ్రీనివాస్, నరసింహచారి, శివరాం, రజిత, రమణ, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తాడ్వాయి మండలం బీరెల్లి ప్రాథమిక పాఠశాలలో ఏఐ తరగుతలను సమగ్ర శిక్షా కోఆర్డినేటర్ కాటం మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నందకిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పట్నంలో ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** పవిత్రమైన రంజాన్ మాసం పురస్కరించుకొని ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో పట్నంలోని వైష్ణవి గార్డెన్స్ లో శుక్రవారం ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, మండలాల ముస్లిం సోదరులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి విందు ఆతిథ్యాన్ని స్వీకరించారు. రంజాన్ మాసం ఎంతో పవిత్రమైన మాసం కావడంతో మతాలకతీతంగా పాల్గొంటూ ఆనందాన్ని పంచుకుంటారని, స్నేహభావంతో కలిసిమెలిసి ఉంటారని ఎమ్మెల్యే అన్నారు. సందర్భంగా ముస్లిం మత పెద్దలు, ఇబ్రహీంపట్నం ఏసిపి కెపివి రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

# అంబలి కేంద్రాన్ని సందర్శించిన డీసీసీబీ డైరెక్టర్




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** అంబలి కేంద్రాన్ని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా సందర్శించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు వారి ఆధ్వర్యంలో కడ్తాల్ బస్టాండ్ ఆవరణలో పిడిజి కోఆర్డినేటర్ జి.చెన్నకిషన్ రెడ్డి పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన రాగి జావా అంబలి కేంద్రాన్ని శుక్రవారం డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తాతో కలిసి మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి సందర్శించారు.150 రోజుల పాటు గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రాగి పిండిని అందజేయడం జరుగుతుందని తెలిపారు. అంబలి కేంద్రం ఏర్పాటు చేసి శుక్రవారంతో 50 రోజులు పూర్తవుతున్న సందర్భంగా బాటసారులు, ప్రయాణికులకు రాగిజావను పంపిణీ చేశారు. వెంకటేష్ గుప్త మాట్లాడుతూ... కడ్తాల్ లో ఏర్పాటు చేసే అంబలి కేంద్రానికి గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ తరపున 150 రోజులపాటు రాగులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. వేసవిలో ప్రయాణికుల, బాటసారుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన రాగి జావా కేంద్రం వారు చేస్తున్న సేవలకు నిదర్శనమని అన్నారు. అంబలి కేంద్రానికి సహకరిస్తున్న దాతలు అందరికీ ఆయన అభినందించారు. ప్రతీ రోజు 400 మందికి పైగా బాటసారులకు రాగి జావా అందించడం చాలా గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జోగు వీరయ్య, మాజీ సర్పంచ్ లు యాదయ్య, జంగయ్య, లోకేష్, హరిచంద్, తులసి రామ్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, వినోద్, సురేష్, అంజి, శ్రీకాంత్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఇది చారిత్రాత్మక సభ



**హుజూర్ నగర్, మహా:** ఉగాది పర్వదినం రోజున హుజుర్నగర్ లో నిర్వహించ తలపెట్టిన సభ చరిత్రలోనే చారిత్రాత్మకంగా నిలిచి పోతుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ఎ న్.ఉత్తమ్ కుమార్రె డ్డి పేర్కొన్నారు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేదలందరికి సన్న బియ్యం పంపిణీ అన్నది దేశ చరిత్రలోనే ఒక మైలు రాయి లాంటిదని ఆయన కొనియాడారు అటువంటి సన్నబియ్యం పంపిణి ప్రారంభోత్సవ కార్యక్రమం హుజుర్నగర్ కేంద్రంగా జరగడం ఇక్కడి ప్రజల అదృష్టంగా భావిస్తునన్నారు. ఈ నెల 30 న ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని సూర్యాపేట జిల్లా హుజుర్నగర్ నియోజకవర్గ కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్న విషయం విదితమే. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ ప్రాంగణం వేదికగా జరప తలపెట్టిన భారీ బహిరంగ సభ ఏర్పాట్లను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యవేక్షించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంట ఐ. జి.సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్, ఎస్.పి నరసింహ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ లీడర్, క్యాడర్ తో సభా ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల కడుపు నింపేందుకు గాను ప్రభుత్వం తీసుకున్న సన్నబియ్యం పంపిణి కార్యక్రమం ఇక్కడి నుండి ప్రారంబించుకోవడం ఒక అద్భుతమైన ఘట్టాన్ని అవిష్కరించబోతుందన్నారు అటువంటి అద్భుతమైన ఘట్టంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అయి రాష్ట్ర జనాభాలో 84 శాతానికి అందించబోతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ తరలి రావాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.

# జమాత్-ఉల్-విదాతో రంజాన్ కు వీడ్కోలు

**ఆమనగల్లు మహా:** పట్టణంలోని మసీదులో ముస్లిం మత పెద్దలు, ముస్లింలంతా కలిసి రంజాన్ చివరి శుక్రవారం కావటంతో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. రంజాన్ నెల చివరి శుక్రవారాన్ని అల్విదా జుమ్మా లేదా జమాత్ ఉల్ విదా అంటారు. ఈ రోజున ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసి, రంజాన్ కు వీడ్కోలు పలుకుతారు. ఈ రోజున కృతజ్ఞత, ప్రతిబింబం, ఐక్యతను ప్రోత్సహిస్తారు. ఈ సందర్భంగా పవిత్ర రంజాన్ మాసం చివరి శుక్రవారాన్ని సూచిస్తుంది. ఈరోజున రంజాన్ దీవెనల కోసం అల్లాకు కృతజ్ఞతలు తెలిపి, క్షమాపణ కోరుతారు. ఈద్ ఉల్ ఫితర్ కు ముందు అత్యంత పవిత్రమైన రోజులలో ఒకటని భావిస్తారు.

# మహిళల ముందస్తు ఉగాది సంబరాలు

**కాటారం, మహా :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో మహిళలు శుక్రవారం నిర్వహించారు. శుక్రవారం అయ్యప్ప వాడలో మహిళలు అందరూ కలిసి ముందస్తుగా ఉగాది పండుగ వేడుకను నిర్వహించుకున్నారు. అందరూ వెంట తెచ్చిన ఉగాది పండుగ సామాగ్రిని పడకంటి అంజలి ఇంటి నుండి శ్రీ హర్షిత డిగ్రీ కాలేజ్ వరకు తీసుకు వెళ్లి కాలేజీలో షడ్రుచులలో కూడిన ఉగాది పచ్చడిని తయారు చేశారు. మహిళలంతా భక్తి శ్రద్ధలతో పాటలు పాడి పూజలు నిర్వహించి ఉగాది పచ్చడి ,భక్ష్యాలను అందరికీ పంపినీచేశారు. ఒకరికి ఒకరు ఉగాది శుభకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమం నిర్వహించిన పడకంటి అంజలికి పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దండూరి పద్మ, రామగిరి శ్రీదేవి, లక్కాకుల మాధవి, బీరెల్లి పావని మొదలగు వారు పాల్గొన్నారు.

# రెస్టారెంట్ పై శానిటరీ దాడులు

- కుళ్ళిన మాంసం నిల్వల గుర్తింపు



**ఆదిలాబాద్ మహా :** పట్టణంలోని రెస్టారెంట్, స్వీట్ షాపులో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్ ఆధ్వర్యంలో అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి హడలెత్తించారు. ఈ తనిఖీల్లో అధికారులు విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. పట్టణంలోని మామ్స్ కిచెన్ రెస్టారెంట్‌లో కుళ్లిపోయిన మాంసంతోపాటు పాడైన ఆహార పదార్థాలను గుర్తించారు. ఫ్రీజర్‌లో పురుగులు ఉండడం, కిచెన్ అపరిశుభ్రంగా దర్శనమివ్వడంతో పారిశుధ్య నిర్వహణ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిపై ఫినాయిల్ పోశారు. ఇంతటి దారుణ స్థితిలో వ్యాపారం చేయొద్దని రెస్టారెంట్ నిర్వాహకులకు సూచించారు. ఇదే విధమైన వైఖరి యజమానులు అవలంభిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.అలాగే వెంకటేశ్వర స్వీట్ హోమ్ తనిఖీల్లో పాడైన పాత స్వీట్లను గుర్తించామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలియజేశారు. పట్టణంలోని అన్ని స్వీట్ హోమ్స్ ,హోటల్స్ ,రెస్టారెంట్ల పై తనిఖీలు చేపట్టాలని ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# కలిసికట్టుగా ఉంటేనే రాజకీయంగా రాణించగలం



**ఎల్బీనగర్,మహా:** వైశ్యులు కలిసికట్టుగా ఉంటేనే వైద్యులు రాజకీయంగా సాధించగలం అని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ అన్నారు.తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ మహిళా విభాగ్ మహాసభ మహిళ మహోత్సవం నాగోల్ లోని పీఎంఆర్ కన్వెన్షన్ లో శుక్రవారం ఘనంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు డా. ఉప్పల శారద, జనరల్ సెక్రటరీ కాచం సుష్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మాజీ మంత్రి టీజీ వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఇంటికి ఇల్లాలే అందం అన్నట్టుగా, మహిళ బాగుంటేనే సమాజం బాగుంటుందని సమాజంలో మహిళ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించి ముందుకెళ్లాలని సూచించారు. ఒక సీసీ కెమెరా 100 పోలీసులతో సమానం అన్నట్టుగా ఒక మహిళ విద్యావంతురాలై సమాజం కోసం తోడ్పడుతూ అనేక వేల మందిని ప్రోత్సహిస్తూ వారిని అభివృద్ధి పథంలో నడిపించే ఓ శక్తి అని అన్నారు.ఈ కార్యక్రమంలో మహిళల ఫ్యాషన్ షో తో అందరినీ అలరించింది.మహిళలను ఉత్సాహపరచడానికి తంబోలా ఆటలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ శాసనసభ సభ్యుడు సుధీర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాడి లక్ష్మీనారాయణ,కాచం ఫౌండేషన్ అధినేత కాచం సత్యనారాయణ గుప్త, స్టేట్ ఉమెన్స్ కోఆపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి , ప్రముఖ గాయని కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

## సరికొత్త రీఛార్జ్ ప్లాన్..
# సగం ఖర్చుతోనే..





ప్రభుత్వ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ (BSNL) 54 రోజుల సరికొత్త రీఛార్జ్ ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. ఇది అపరిమిత కాలింగ్, డేటా, ఉచిత ఎస్ఎంఎస్ ప్రయోజనాలను బడ్జెట్ ఫ్రెండ్లీ ధరలో అందిస్తుంది. ఇదే వ్యాలిడిటీ ప్లాన్‌ల కోసం ఇతర ప్రైవేటు టెలికం కంపెనీలలో అయ్యే ఖర్చులో దాదాపు సగం ఖర్చుతోనే బీఎస్ఎన్ఎల్ కొత్త ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చింది.

**బీఎస్ఎన్ఎల్ 54 రోజుల ప్లాన్ కీలక ఫీచర్లు**

బీఎస్ఎన్ఎల్ తన అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్ ద్వారా ఈ బడ్జెట్ ఫ్రెండ్లీ రీఛార్జ్ ప్లాన్‌ను ప్రకటించింది. కేవలం రూ.347కే లభిస్తున్న ఈ ప్లాన్‌లో అనేక ఆకర్షణీయమైన ప్రయోజనాలు ఉన్నాయి. ఉచిత నేషనల్ రోమింగ్ తో సహా భారతదేశంలోని ఏ నంబర్ కు అయినా అపరిమిత వాయిస్ కాల్స్‌ను వినియోగదారులు ఆస్వాదించవచ్చు. ఈ ప్లాన్ రోజుకు 2 జీబీ హైస్పీడ్ డేటాను అందిస్తుంది. అంటే 54 రోజుల వ్యాలిడిటీ కాలంలో మొత్తం 108 జీబీ డేటా లభిస్తుంది. అలాగే రోజూ 100 ఉచిత ఎస్ఎంఎస్‌లు లభిస్తాయి. దీంతోపాటు ఈ ప్లాన్‌లో బైటీవీకి (BITV) కాంప్లిమెంటరీ యాక్సెస్ కూడా ఉంది. ఇందులో 400కి పైగా లైవ్ టీవీ ఛానళ్లను వీక్షించవచ్చు. ఈ కొత్త ప్లాన్‌తో పాటు తన ప్రతిష్ఠాత్మక విస్తరణ ప్రయత్నాలతో బీఎస్ఎన్ఎల్ ప్రైవేట్ టెలికాం సంస్థలకు సవాలు విసురుతోంది. తమ వినియోగదారులకు మరింత విలువ ఆధారిత సేవలను అందించడానికి సిద్ధంగా ఉంది. బీఎస్ఎన్ఎల్ ఇటీవల 75,000 కొత్త 4జీ మొబైల్ టవర్లను ఏర్పాటు చేసింది. రాబోయే వారాల్లో 100,000 కొత్త 4జీ టవర్ల మైలురాయిని చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# ఏఐని ఎవరెలా వాడుతున్నారు?

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) వినియోగం విస్తృతంగా పెరిగిపోయింది. ఇప్పటికే చాలా మంది కస్టమర్లు ఏఐ వేళ్ల మీద వినియోగిస్తున్నారు. ఏఐ ఇప్పుడు భారతీయ వినియోగదారుల దైనందిన జీవితంలో ఎంత లోతుగా పాతుకుపోయిందో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత బిజినెస్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్లాట్‌ఫామ్ 'సర్వీస్ నౌ' తన తాజా సర్వేలో వివరించింది.



**షాపింగ్, ఫుడ్..**

షాపింగ్ సిఫార్సుల కోసం 84 శాతం మంది, ఆహారం, భోజన సూచనల కోసం 82 శాతం మంది, పెట్టుబడి అవకాశాలను పరిశీలించడానికి ప్రతి ఐదుగురిలో నలుగురు (78 శాతం) ఏఐ చాట్‌బాట్‌లను ఉపయోగిస్తున్నారని సర్వేలో తేలింది. ఇది ఏఐ ఆధారిత ఆర్థిక నిర్ణయాల వైపు మళ్లడాన్ని సూచిస్తుందని సర్వే తెలిపింది.

దేశంలోని 80 శాతం మంది వినియోగదారులు ఇప్పుడు ఫిర్యాదుల స్థితిని తెలుసుకునేందుకు, ఉత్పత్తులపై సలహాల కోసం, స్వయం సహాయక మార్గదర్శకాల కోసం ఏఐ చాట్‌బాట్‌లను ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా ఆరుగురిలో ఐదుగురు సందేహాల నివృత్తికి, సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాధనాలను చురుకుగా ఉపయోగిస్తున్నారని సర్వే పేర్కొంది.

**కస్టమర్ సర్వీస్‌లో మాత్రం..**

రోజువారీ జీవితంలో కృత్రిమ మేధ పెరుగుతున్న పాత్ర ఉన్నప్పటికీ, దాని సమయాన్ని ఆదా చేసే సామర్థ్యాలు కస్టమర్ సర్వీస్ నిరీక్షణ సమయాలను తగ్గించడంలో మాత్రం సహాయపడటం లేదు. భారతీయ వినియోగదారులు గత సంవత్సరంలో 15 బిలియన్ గంటలు వేచి ఉన్నారు అని సర్వీస్ నౌ కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ రిపోర్ట్ తెలిపింది. కాగా వ్యాపార సంస్థలు వారానికి సగటున ఒక రోజు కంటే తక్కువ కస్టమర్ సమస్యలను పరిష్కరించడానికి, మిగిలిన నాలుగు రోజులు బృందాల ప్రతిస్పందనలు, పరిపాలనా విధులు, ప్రమోషనల్ ఆఫర్లు, శిక్షణ, విరామాల కోసం వెచ్చిస్తున్నాయని సర్వే చెబుతోంది.

వ్యాపార సంస్థలకు భారీ అవకాశాలను అందించే ప్రపంచంలోనే మూడో అతిపెద్ద వినియోగదారుల మార్కెట్ గా భారత్ అవతరించబోతోంది. కొత్త ఏఐ టూల్స్ కస్టమర్ సర్వీస్ పై తమ అంచనాలను పెంచాయని 82 శాతం మంది వినియోగదారులు వ్యక్తం చేశారని సర్వీస్ నౌ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సుమీత్ మాథుర్ తెలిపారు. 2024 నవంబర్ 1 నుంచి 15 వరకు సుమారు 5,000 మంది వినియోగదారులపై ఈ సర్వే నిర్వహించారు.



# ఏటీఎం విత్ డ్రాపై ఛార్జీల మోత
## బ్యాంకులకు ఆర్‌బీఐ గ్రీన్ సిగ్నల్

ఢిల్లీ: ఏటీఎంలో నగదు లావాదేవీలపై కస్టమర్లకు షాకిచ్చేందుకు బ్యాంకులు సిద్ధమయ్యాయి. సొంత బ్యాంక్ ఏటీఎం నుంచి నెలలో ఉచితంగా ఐదు లావాదేవీలు చేసుకోవచ్చు. అయితే, మే 1 నుంచి వీటి పరిమితి దాటితే ఒక్కో లావాదేవీపై రూ.23 వసూలు చేసేందుకు బ్యాంకులకు ఆర్‌బీఐ అనుమతి ఇచ్చింది. ప్రస్తుతం, వినియోగదారులు ఉచిత లావాదేవీ పరిమితిని దాటిన తర్వాత ప్రతి లావాదేవీకి రూ.21 చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పుడు ఆ మొత్తాన్ని పెంచుతూ ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంది. అదే వేరే బ్యాంకు ఏటీఎం నుంచి అయితే మెట్రో ప్రాంతాల్లో ఐదు లావాదేవీలు, ఇతర ప్రాంతాల్లో 3 లావాదేవీలకు అనుమతి ఉంది. ఆర్‌బీఐ తాజాగా అనుమతించిన నేపథ్యంలో ఆ మొత్తం రూ.23కి పెరగనుంది.

# భూకంపాలకు హోమ్ ఇన్సూరెన్స్ పనికొస్తుందా?



మయన్మార్, థాయ్‌ల్యాండ్ దేశాలలో ఇటీవల అధిక తీవ్రతతో సంభవించిన వినాశకరమైన భూకంపం విపత్తు ప్రభావిత ప్రాంతాల్లో ఇంటి యజమానుల సన్నద్ధతపై ఆందోళనలను రేకెత్తించింది. భూకంపాలు ఊహించలేనప్పటికీ, సరైన బీమా పాలసీతో మీ ఇంటిని సురక్షితం చేసుకోవడం ఇలాంటి విపత్తుల సమయంలో ఆర్థిక ఉపశమనం కలిగిస్తుంది.

**హోమ్ ఇన్సూరెన్స్ భూకంపాలను కవర్ చేస్తుందా?**

ప్రామాణిక గృహ బీమా పాలసీలు సాధారణంగా భూకంప నష్టాన్ని కవర్ చేయవు. అయితే, చాలా బీమా సంస్థలు భూకంప బీమాను యాడ్‌ఆన్ లేదా ప్రత్యేక పాలసీగా అందిస్తున్నాయి. ఈ కవరేజీ మీ ఇంటి నిర్మాణం, దాని విషయాలు రెండింటినీ భూకంప కార్యకలాపాల వల్ల కలిగే నష్టాల నుండి రక్షించగలదు.

**భూకంప బీమా ముఖ్య లక్షణాలు**

**స్ట్రక్చరల్ కవరేజ్:** భూకంపాల వల్ల కలిగే నష్టాల నుండి భవనాన్ని రక్షిస్తుంది.

**కంటెంట్ కవరేజీ:** ఇంట్లోని విలువైన వస్తువులు, వస్తువులను కవర్ చేస్తుంది. అదనపు జీవన ఖర్చులు: మీ ఇల్లు నివాసం ఉండలేని విధంగా మారితే తాత్కాలిక వసతి కోసం ఆర్థిక సహాయం అందిస్తుంది.

**భూకంప బీమా ఎందుకు ముఖ్యం?**

మయన్మార్, థాయ్‌ల్యాండ్‌తోపాటు భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లోనూ భూకంప ప్రభావం కనిపించింది. మన దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో గతంలోనూ భూకంప ప్రమాదాలు సంభవించాయి. ఇలాంటి ప్రాంతాలలో భూకంప ప్రభావానికి ఇల్లు కూలిపోతే తరువాత పునర్నిర్మించడానికి ఆర్థిక భారం అధికంగా ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో భూకంప బీమా నిశ్చింతను ఇస్తుంది. ఇంటి యజమానులకు ఆర్థిక భారం లేకుండా నష్టాల నుండి కోలుకునేలా చేస్తుంది.

**ఇవి పరిగణనలోకి తీసుకోవాలి**

మినహాయింపులు: భూకంప బీమా పాలసీలు సాధారణంగా అధిక మినహాయింపులతో వస్తాయి. ఇది క్లెయిమ్ చెల్లింపులను ప్రభావితం చేస్తుంది.

**కవరేజ్ పరిమితులు:**

ఇంటి నిర్మాణంతోపాటు ఇంట్లోని వస్తువులకూ గరిష్ఠ కవరేజీ ఉందో లేదో సరిచూసుకోండి.

**పాలసీ నిబంధనలు:**

చేరికలు, మినహాయింపులు, అందుబాటులో ఉన్న ఏదైనా అదనపు రైడర్లను సమీక్షించండి.

# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL




## జ్యూస్ అమ్మే వ్యక్తికి
# రూ.7.79 కోట్ల ట్యాక్స్ నోటీస్

202425 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న తరుణంలో అందరూ ట్యాక్స్ చెల్లించాల్సి ఉంది. అయితే ఉత్తరప్రదేశ్‌లోని అలీఘర్‌కు చెందిన ఒక జ్యూస్ వ్యాపారి.. తనకు వచ్చిన ట్యాక్స్ నోటీస్ చూసి ఒక్కసారిగా ఖంగుతిన్నాడు. ప్రస్తుతం ఈ వార్త నెట్టింట్లో వైరల్ అవుతోంది. ఉత్తరప్రదేశ్‌లోని అలీఘర్‌కు చెందిన మొహమ్మద్ రహీస్ జ్యూస్ అమ్ముకుంటూ జీవినం సాగిస్తున్నారు. మార్చి 18న అతనికి ఆదాయపు పన్ను శాఖ ట్యాక్స్ నోటీస్ పంపించింది. అందులో రూ. 7.79 కోట్లు ట్యాక్స్ చెల్లించాలని ఉంది. ఇది చూడగానే అతడు షాక్‌కు గురయ్యాడు. దీనిపై మార్చి 28 లోపల స్పందించాలని ఉండడంతో అతనికి ఏమి చేయాలో పాలుపోలేదు. భారీ మొత్తంలో చెల్లించాలని వచ్చిన ట్యాక్స్ నోటీసు గురించి కనుక్కోవడానికి.. స్నేహితులను సంప్రదించారు. వారు సంబంధిత అధికారులను కలుసుకోమని సలహా ఇచ్చారు. అధికారులు సైతం అతనికి వచ్చిన ట్యాక్స్ చూసి ఆశ్చర్యపోయారు. తాను రోజుకు కేవలం రూ. 500 నుంచి రూ. 600 మాత్రమే సంపాదిస్తానని, పెద్ద లావాదేవీలు ఎప్పుడూ చేయాలని.. అధికారులతో చెప్పాడు. బాధితుని పాన్ కార్డు వివరాలు ఎవరో వినియోగించి ఉండవచ్చని ఆదాయపన్ను శాఖ అధికారులు వెల్లడించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయమని సలహా ఇచ్చారు. తన వ్యక్తిగత డేటాను దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, దోషులను శిక్షించి జైలుకు పంపాలని రహీస్ కోరుకున్నాడు.

# భావ ప్రకటన స్వేచ్ఛ.. సుప్రీం కోర్టు సంచలన తీర్పు



**న్యూఢిల్లీ:** వాక్ స్వాతంత్ర్యం.. భావ ప్రకటన స్వేచ్ఛపై దేశ సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రజాస్వామ్యంలో.. అందునా ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య వ్యవస్థలో అవి భాగమని.. ప్రాథమిక హక్కులను పరిరక్షించడం న్యాయస్థానాల విధి అని స్పష్టం చేస్తూ శుక్రవారం సంచలన తీర్పు వెల్లడించింది. రెచ్చగొట్టేలా పద్యాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేశారని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గర్హీపై గుజరాత్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం.. సమాజంలో భావ ప్రకటన స్వేచ్ఛ అంతర్భాగమని, ఆ హక్కును గౌరవించాల్సిన అవసరం కచ్చితంగా ఉందని వ్యాఖ్యానించింది. ఈ క్రమంలో గుజరాత్ పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ.. ఈ కేసులో ఎలాంటి నేరం లేకపోయినా అత్యుత్సాహం ప్రదర్శించారని వ్యాఖ్యానించింది. ఈ సందర్భంలోనే ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. సినిమాలు, కవిత్వం.. సాహిత్యం, వ్యంగ్యం.. మనుషుల జీవితాన్ని మరింత అర్థవంతం చేస్తాయి. ఆలోచనలు, అభిప్రాయాలను వ్యక్తీకరించే స్వేచ్ఛ లేనప్పుడు.. ఆర్టికల్ 21 ప్రకారం గౌరవప్రదమైన జీవితాన్ని గడపడం ఎలా సాధ్యమవుతుంది?. ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య వ్యవస్థలో.. విభిన్న అభిప్రాయాలను.. ప్రతివాదనలతో ఎదుర్కోవాలే తప్ప అణచివేతతో కాదు. ఒకవేళ ఆ వ్యాఖ్యలపై ఆంక్షలు విధించాల్సివస్తే.. అవి సహేతుకంగా ఉండాలే గానీ.. ఊహాజనితంగా కాదు. ఓ వ్యక్తి అభిప్రాయాలను ఎక్కువమంది వ్యతిరేకించినా సరే.. ఆ వ్యక్తి భావ ప్రకటనా హక్కును తప్పనిసరిగా గౌరవించాల్సిందే. భావ స్వేచ్ఛ ప్రకటన, వాక్ స్వాతంత్ర్యం(Freedom of Speech) అనేవి ప్రజాస్వామ్యంలో అంతర్భాగం. ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడటం న్యాయస్థానాల విధి. పోలీసులు రాజ్యాంగ ఆదర్శాలకు కట్టుబడి ఉండాలి. అంతిమంగా.. ఆర్టికల్ 19(1)ను కాపాడాల్సిన బాధ్యత న్యాయమూర్తులదే'' అని ధర్మాసనం స్పష్టం చేస్తూ.. గుజరాత్ పోలీసులు దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టేసింది.

**జరిగింది ఇదే..**


గుజరాత్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి గతేడాది డిసెంబరులో 46 సెకన్ల నిడివి ఉన్న వీడియో ఒకటి పోస్ట్ చేశారు. ఓ పెళ్లి వేడుక మధ్యలో ఆయన నడిచివస్తుండగా పూలవర్షం కురిపిస్తూ.. బ్యాక్‌గ్రౌండ్ ఓ పద్యం వినిపించారు. అయితే, ఆ పద్యంలో పదాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని, అవి మత విశ్వాసాలు, సామరస్యాన్ని, జాతి ఐక్యతను దెబ్బతీసేలా ఉన్నాయన్న ఫిర్యాదుతో గుజరాత్ పోలీసులు కేసు నమోదు చేశారు. గుజరాత్ హైకోర్టులో ఇమ్రాన్‌కు ఊరట లభించలేదు. దీంతో హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టుకు వెళ్లారు. దీనిపై విచారణ చేపట్టిన ద్విసభ్య ధర్మాసనం.. ఎఫ్ఐఆర్‌ను కొట్టేస్తూ కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్‌కు ఊరట ఇచ్చింది.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు
# గుడ్ న్యూస్

**ఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం శుభవార్త చెప్పింది. అదనపు 2 శాతం డీఏ పెంపునకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.దీంతో ప్రస్తుతం ఉన్న డియర్‌నెస్ అలవెన్స్ (డీఏ) 53 శాతం నుంచి 55 శాతానికి పెరిగినట్లైంది. రెండు శాతం డీఏ పెంపు ద్వారా 48.56 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, 66.55 లక్షల మంది పెన్షనర్లకు లాభం చేకూరనుంది. తాజా కేబినెట్ నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వంపై రూ.6వేల 614 కోట్ల భారం పడనుండగా.. పెరిగిన డీఏ జనవరి 2025 నుంచి అమల్లోకి రానుంది. రైతులపై భారం తగ్గించేందుకు పోషక ఆధారిత ఎరువులపై సబ్సిడీ ఇస్తున్న కేంద్రం ఇస్తుంది. అయితే, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పోషక ఆధారిత పీఅండ్‌కే ఎరువులకు సబ్సిడీ (రూ. 37,216 కోట్లు) మంజూరు చేసింది. న్యూట్రియంట్ బేస్డ్ సబ్సిడీ పథకం కింద 28 రకాల పోషక ఆధారిత ఎరువుల గరిష్ట చిల్లర ధరను తయారీదారులు/దిగుమతిదారులు తగినంత స్థాయిలో నిర్ణయించేందుకు అనుమతి ఇచ్చింది.

# హైకోర్టునే బురిడీ కొట్టించిన మాయగాడు


**ముంబై:** ఫోర్జరీ, కాపీ రైట్ ఉల్లంఘన కేసులో నిందితుడు ఏకంగా జడ్జి సంతకాన్నే ఫోర్జరీ చేశాడు. ఆ ఫేక్ కోర్టు ఆదేశాలతో హైకోర్టును ఆశ్రయించాడు. ముందస్తు బెయిల్ మీద ఎంచక్కా బయటకు వచ్చాడు. చివరకు.. ఆ మోసం బయటపడేలోపు పరారయ్యాడు. ఆ మాయగాడి వ్యవహారంపై బాంబే హైకోర్టు (Bombay High Court) భగ్గుమంది. కోర్టు ఆదేశాలతో పోలీసులు నిందితుడి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. పుణేకి చెందిన సీటీఆర్ మానుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ డిజైన్లను చెన్నైకు చెందిన ఓ కంపెనీ ఉపయోగించడంపై 2022లో ఫిర్యాదు దాఖలైంది. దర్యాప్తులో సీటీఆర్‌లో పని చేసే ఉద్యోగులే ఈ మోసానికి పాల్పడినట్లు తేలింది. సీటీఆర్ ఉద్యోగులు.. మాజీ ఉద్యోగులు కొందరి మీద విమంతల్ పీఎస్‌లో కేసు నమోదు అయ్యింది. 20162017 పని చేసిన హరిబావు చెంటే కూడా నిందితుల జాబితాలో ఉన్నాడు. అతనిపై ఫోర్జరీ, కాపీ రైట్ ఉల్లంఘన అభియోగాలున్నాయి.



అయితే.. ముందస్తు బెయిల్ కోసం హరిబావు పుణే జిల్లా కోర్టును ఆశ్రయించగా.. అతనికి చుక్కెదురైంది. దీంతో బాంబే హైకోర్టులో ఓ పిటిషన్ వేశాడు. ఈ క్రమంలో పుణే కోర్టు జడ్జి సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ కోర్టు ఆదేశాలను సృష్టించాడు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 169 ప్రకారం.. నిందితుడి మీద అభియోగాలకు సంబంధించి సరైన ఆధారాలు లేకుంటే న్యాయ విచారణ లేకుండా విడుదల చేయొచ్చు. దీన్ని ఆసరాగా చేసుకుని పుణేకు చెందిన ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సంతకాన్ని చెంటే ఫోర్జరీ చేశాడు. ఆ నకిలీ ఆదేశాలకు హైకోర్టుకు సమర్పించి.. ఈ ఏడాది జనవరి 17వ తేదీన బెయిల్ పొందాడు. అయితే.. ఈ వ్యవహారంపై అనుమానంతో సీటీఆర్ కంపెనీ విమంతల్ పోలీసులను ఆశ్రయించింది. వాళ్లు ఈ విషయాన్ని ఇటు పుణే కోర్టు.. అటు హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. హరిబావు సమర్పించిన కోర్టు ఆదేశాలు రాతపూర్వకంగా ఉండడంతో హైకోర్టు పరిశీలన జరిపింది. జడ్జి సంతకం ఫోర్జరీ, నకిలీ ఆదేశాలు బెయిల్ పొందినట్లు తేలడంతో హైకోర్టు తీవ్రంగా భావించింది. అతని బెయిల్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించి.. అతనిపై మరో కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించింది. ప్రస్తుతం పరారీలో ఉన్న హరిబావు చెంటే కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

# ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్‌కు షాక్.. మరో కేసు నమోదు

**ఢిల్లీ:** ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై పిటిషన్ దాఖలైన క్రమంలో ఆయనపై కేసు నమోదు చేయాలని ఇటీవల ఢిల్లీ కోర్టు ఆదేశాలు చేయగా, పోలీసులు ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ మేరకు పోలీసులు కోర్టుకు రిపోర్ట్‌ను సమర్పించారు. ఈ కేసుకు సంబంధించిన విచారణ జరుగుతోందని, మరింత సమయం కావాలని కోర్టుకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. దీంతో తదుపరి విచారణను ఏప్రిల్ 18కి కోర్టు వాయిదా వేసింది. కాగా, 2019లో ద్వారకలో భారీ హోర్డింగ్‌లు ఏర్పాటుకు నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ ఢిల్లీ రౌజ్‌అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ వ్యవహారంలో కేజ్రీవాల్ సహా ఇతర నాయకులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలంటూ పిటిషనర్ న్యాయస్థానాన్ని కోరారు. ఆ అభ్యర్థనకు ఢిల్లీ కోర్టు అంగీకారం తెలిపింది. కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసిజర్ సెక్షన్ 156(3) కింద దరఖాస్తును అనుమతించాల్సిన అవసరం ఉందని ఈ కోర్టు అభిప్రాయపడింది. ఢిల్లీ ప్రివెన్షన్ ఆఫ్ డిఫేస్‌మెంట్ ఆఫ్ ప్రాపర్టీ యాక్ట్, 2007లోని సెక్షన్ 3 కింద నమోదు చేయాలని కోర్టు పేర్కొంది. అక్రమ హోర్డింగ్‌లు కూలిపోవడం



వల్ల గతంలో మరణాలు నమోదయ్యాయని, అందువల్ల కఠిన చర్యలు అవసరమని కోర్టు నొక్కి చెప్పింది. వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఎస్‌హెచ్‌వోను ఆదేశించినట్లు అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నేహా మిట్టల్ తన తీర్పులో పేర్కొన్నారు. 2019లో దాఖలైన ఫిర్యాదులో కేజ్రీవాల్, కొందరు నేతలు ఆ ప్రాంతం అంతటా భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజా నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు.



# కేవలం రెడీ చేసినందుకు రూ.1 లక్ష దాకా తీసుకుంటారు : రకుల్

సెలబ్రిటీల సంపాదనకు తగ్గట్లే ఖర్చు కూడా భారీగానే ఉంటుంది. ఏదైనా ఈవెంట్‌కు, అవార్డుల ఫంక్షన్‌కు వెళ్లాలంటే మేకప్, హెయిర్ స్టైలింగ్ చేసేవారు తప్పనిసరి. వీళ్లు సందర్భాన్ని బట్టి వేలు, లక్షల్లో తీసుకుంటారని చెప్తోంది హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో రకుల్ మాట్లాడుతూ.. మేకప్ వేసేందుకు, డ్రెస్‌కు తగ్గట్లుగా హెయిర్ స్టైల్ చేసేందుకు ఒక టీమ్ పనిచేస్తూ ఉంటుంది.

## ఆరేళ్లుగా ఒకే టీమ్‌తో పని చేస్తున్నా..

రెడ్‌కార్పెట్‌పై మేము అందంగా కనిపించేందుకు వీళ్లు సాయపడతారు. కేవలం ఒక్క లుక్ కోసం రూ.20 వేల నుంచి రూ.1 లక్ష వరకు తీసుకుంటారు. స్టైలిస్ట్‌కు, మేకప్ టీమ్‌కు, ఫోటోగ్రాఫర్‌కు.. ఇలా అందరికీ డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. నేను ఆరేళ్లపాటు ఒకే మేకప్- హెయిర్ టీమ్‌తో కలిసి పని చేస్తున్నాను. వారు నాకు కుటుంబసభ్యుల్లానే అనిపిస్తారు.

## పైసా ఖర్చుండదనేది నిజం కాదు!

ఈవెంట్స్ కోసం డిజైనర్స్ మాకు ఉచితంగానే దుస్తులు పంపిస్తారు. దీనివల్ల మాకు పైసా ఖర్చు ఉండదని అందరూ అనుకుంటారు. కానీ అది నిజం కాదు. వాళ్లు ఫ్రీగానే ఇచ్చినా దాన్ని తెచ్చినవారికి.. ఆ డ్రెస్‌కు తగ్గట్లుగా మమ్మల్ని అందంగా రెడీ చేసిన స్టైలిస్ట్‌కు డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. కొరియర్ చార్జీలు కూడా అందులోనే జత చేస్తారు. అందుకే అంతర్జాతీయ డిజైనర్ రూపొందించిన డ్రెస్ ధరించాలంటే భారీగా ఖర్చు చేయాల్సి ఉంటుంది.

## నాకైతే నచ్చదు

ఆ డ్రెస్‌కు తగ్గట్లుగా ఎలా రెడీ అవ్వాలన్నది స్టైలిస్ట్ చూసుకుంటాడు. డిజైనర్లు మాకు డ్రెస్‌లు ఇవ్వాలని తహతహలాడుతుంటారు. ఎందుకంటే మేము వాటిని ధరించినప్పుడు ఎక్కువ అటెన్షన్ వస్తుంది. డిజైనర్ క్రియేటివిటీ ఎక్కువమందికి తెలుస్తుంది. వారి అమ్మకాలు కూడా పెరుగుతాయి. అయితే చాలామటుకు నేను ఉచితంగా దుస్తులు తీసుకోవడానికి ఇష్టపడను అని రకుల్ చెప్పుకొచ్చింది.

# కారులో థియేటర్‌కు వచ్చిన స్టార్ హీరో.. అభిమానుల దెబ్బకు ఆటోలో!

కోలీవుడ్ స్టార్ హీరో చియాన్ విక్రమ్ తాజాగా వీర ధీర శూర మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. ఈ సినిమాలో రాయన్ మూవీ ఫేమ్ దుషారా విజయన్ హీరోయిన్‌గా నటించింది. ఈ యాక్షన్ థ్రిల్లర్ మూవీ ఎస్‌యూ అరుణ్‌కుమార్ దర్శకత్వం వహించారు. అయితే ఊహించని విధంగా తొలి రోజే ఈ సినిమా వివాదంలో చిక్కుకుంది. ఓటీటీ హక్కుల విషయంలో వివాదం తలెత్తడంతో మార్నింగ్ షోలు ఓవర్‌సీస్‌తో పాటు దేశవ్యాప్తంగా రద్దయ్యాయి. అయితే ఆ తర్వాత వివాదం సద్దుమణగడంతో ఈవినింగ్ నుంచి సినిమాను ప్రదర్శించారు. ఈ మూవీ చూసేందుకు విక్రమ్ హీరో శివ కార్తికేయన్‌తో కలిసి చెన్నైలోని ఐకానిక్ సత్యం థియేటర్‌లో వీక్షించారు. అభిమానుల సమక్షంలో సినిమాను చూసి ఎంజాయ్ చేశారు. వీరి ధీర సూర మూవీ చూసిన తర్వాత విక్రమ్ తన కారులో కాకుండా ఆటోలో ప్రయాణించారు. థియేటర్ నుంచి ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కారు. దీనికి సంబంధించిన వీడియోను ఫ్యాన్స్ సోషల్ మీడియాలో షేర్ చేశారు.



ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే అభిమానుల నుంచి తప్పించుకోవడానికే విక్రమ్ ఆటోలో వెళ్లినట్లు తెలుస్తోంది. ఆయన కూర్చున్న ఆటోను కూడా అభిమానులు చుట్టుముట్టారు. దీంతో వారి నుంచి తప్పించుకునే క్రమంలోనే ఎగ్జిట్ గేట్ నుంచి ఆటోలో బయలుదేరి వెళ్లాడు. కాగా.. ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య, సూరజ్ వెంజరమూడు ప్రధాన పాత్రల్లో నటించారు.

# యాంకర్ విష్ణుప్రియకు హైకోర్టులో షాక్

## కేసు కొట్టేయడం కుదరదు


### దర్యాప్తునకు సహకరించాలన్న హైకోర్టు

**మహా :** బెట్టింగ్ యాప్స్ కేసులో నటి విష్ణుప్రియ దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టులో విచారణ జరిగింది. మియాపూర్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టి వేయాలని విష్ణుప్రియ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎఫ్ఐఆర్ కొట్టివేయడానికి, దర్యాప్తుపై స్టే విధించేందుకు హైకోర్టు నిరాకరించింది. దర్యాప్తునకు సహకరించాలని విష్ణుప్రియను ఆదేశించిన ధర్మాసనం చట్ట ప్రకారం ముందుకు వెళ్లాలని పోలీసులకు స్పష్టం చేసింది. బెట్టింగ్ యాప్స్‌పై ప్రచారం చేసిన పలువురు నటీనటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

# రాబిన్‌హుడ్‌లో డేవిడ్ వార్నర్..

## రెండు నిమిషాలకే ఇంత హంగామా చేశారా?

నితిన్, శ్రీలీల జంటగా నటించిన తాజా చిత్రం రాబిన్‌హుడ్. అభిమానుల భారీ అంచనాల మధ్య ఈ రోజే థియేటర్లలోకి వచ్చేసింది. వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన ఈ సినిమా ఉగాది కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. అయితే ఈ సినిమా ద్వారా ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చారు. ఈ సినిమాలో ఓ కీలక పాత్రలో కనిపించారు. ఈ మూవీ రిలీజ్ ముందు ప్రమోషన్లలోనూ బిజీగా పాల్గొన్నారు. రాబిన్‌హుడ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మెరిశారు. దీంతో రాబిన్‌హుడ్‌లో డేవిడ్ రోల్‌పై అభిమానుల్లో మరింత అంచనాలు పెరిగాయి. అయితే ఈ సినిమాలో డేవిడ్ వార్నర్ పాత్రపై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. కెమియో రోల్ అయినప్పటికీ ట్రైలర్ ఎంట్రీ ఇవ్వడం చూసిన



ఫ్యాన్స్ ఓ రేంజ్‌లో ఉంటుందని ఊహించారు. కానీ అభిమానులు ఊహించినంత స్థాయిలో మాత్రం డేవిడ్ పాత్ర కనిపించలేదు. కేవలం 2 నిమిషాల 50 సెకన్ల పాటు కనిపించి ఉస్సురుమనిపించారు. రాబిన్‌హుడ్‌లో కొద్దిసేపే కనిపించడంపై డేవిడ్ వార్నర్ అభిమానులు నిరాశకు గురయ్యారు. అది కూడా కేవలం డ్రగ్ డీలర్ పాత్రలో కనిపించడం.. కథలో పెద్దగా ప్రాముఖ్యత లేకపోవడంతో మైనస్‌గా మారింది. మూవీ ప్రమోషన్స్‌లో డైరెక్టర్ వెంకీ కుడుముల వార్నర్ పాత్రపై ఆసక్తికర కామెంట్స్ చేశారు. వార్నర్ రోల్ ఈ సినిమాను మరో రేంజ్‌కు తీసుకెళ్తుందని అన్నారు. అంతేకాకుండా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హాజరు కావడం, స్వయంగా అతను కూడా మూవీ ప్రమోషన్లలో పాల్గొనడంతో అభిమానులు భారీగానే ఆశలు పెట్టుకున్నారు. కనీసం పది నిమిషాల పాటైనా వార్నర్ స్క్రీన్‌పై సందడి చేస్తే బాగుండేదని ఫ్యాన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా ఈ మూవీతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన వార్నర్.. భవిష్యత్తులో మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుందాం.


## క్రీడా వార్తలు | SPORTS NEWS

# సీఎస్‌కే కంచు కోట బద్దలు.. 17 ఏళ్ల తర్వాత తొలి విజయం

ఐపీఎల్ 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండో విజయం సాధించింది. ఈ టోర్నీలో భాగంగా చెపాక్ వేదికగా జరిగిన చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 50 పరుగుల తేడాతో ఆర్సీబీ గెలుపొందింది. 197 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి సీఎస్‌కే నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 146 పరుగులు చేసింది. సీఎస్‌కే బ్యాటర్లలో రచిన్ రవీంద్ర(41) టాప్ స్కోరర్‌గా నిలవగా.. ఆఖరిలో ధోని(16 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 30) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఆర్సీబీ బౌలర్లలో జోష్ హాజిల్ వుడ్ మూడు వికెట్లు పడగొట్టగా.. యశ్ దయాల్, లివింగ్‌స్టోన్ తలా రెండు వికెట్లు సాధించారు.

చెపాక్‌లో సీఎస్‌కేపై ఆర్సీబీ విజయం సాధించడం 2008 సీజన్ తర్వాత ఇదే తొలిసారి. దీంతో సీఎస్‌కే కంచుకోటను పాటిదార్ సారథ్యంలోని ఆర్సీబీ బద్దలు కొట్టింది. 2008 సీజన్ తర్వాత ఏ ఆర్సీబీ కెప్టెన్ కూడా చెపాక్‌లో సీఎస్‌కేపై తన జట్టును గెలిపించకలేకపోయాడు. ఇప్పుడు అది పాటిదార్‌కు సాధ్యమైంది.

కావడం విశేషం. ఇక ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ 7 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. ఆర్సీబీ బ్యాటర్లలో రజిత్ పాటిదార్(51) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా.. ఫిల్ సాల్ట్(32), విరాట్ కోహ్లి(31), పడిక్కల్(27) రాణించారు. ఆఖరి ఓవర్‌లో టిమ్ డేవిడ్( 8 బంతుల్లో 1ఫోర్లు, 3 సిక్స్‌లతో 22) మెరుపులు మెరిపించాడు. సీఎస్‌కే బౌలర్లలో నూర్ ఆహ్మద్ మూడు వికెట్లు పడగొట్టగా.. పతిరానా రెండు, ఖాలీల్ అహ్మద్, అశ్విన్ తలా వికెట్ సాధించారు.





# అందుకే సన్‌రైజర్స్ వదిలేసింది..

## అక్కడ కూడా అదే ఆటనా?




ఐపీఎల్ 2025లో చెన్నై సూపర్ కింగ్స్ ఆటగాడు రాహుల్ త్రిపాఠి వరుసగా రెండో మ్యాచ్‌లోనూ విఫలమయ్యాడు. ఈ మెగా టోర్నీలో భాగంగా చెపాక్ వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్‌లో త్రిపాఠి దారుణ ప్రదర్శన కనబరిచాడు. మరోసారి ఓపెనర్‌గా బరిలోకి దిగిన త్రిపాఠి కేవలం 5 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్‌కు చేరాడు. జోష్ హాజిల్ వుడ్ బౌలింగ్‌లో చెత్త షాట్‌కు ప్రయత్నించి తన వికెట్‌ను కోల్పోయాడు. అంతకుముందు ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా త్రిపాఠి కేవలం 2 పరుగులు మాత్రమే చేశాడు. ఈ క్రమంలో త్రిపాఠిని సీఎస్‌కే ఫ్యాన్స్ దారుణంగా ట్రోలు చేస్తున్నారు. ఈ చెత్త ఆడినందుకే సన్‌రైజర్స్ వదిలేసింది అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. కాగా రాహుల్ త్రిపాఠి గత కొన్ని సీజన్లుగా ఎస్‌ఆర్‌హెచ్‌కు ప్రాతినిథ్యం వహించాడు. కానీ ఈ ఏడాది ఐపీఎల్ సీజన్ మెగా వేలానికి ముందు ఎస్‌ఆర్‌హెచ్ విడిచిపెట్టింది. దీంతో వేలంలోకి వచ్చిన అతడిని సీఎస్‌కే రూ. 3.40 కోట్లకు కొనుగోలు చేసింది. తన ధరకు తగ్గ న్యాయం త్రిపాఠి చేయలేకపోతున్నాడు. ఇక ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది.

# చరిత్ర సృష్టించిన విరాట్ కోహ్లి



ఐపీఎల్ 2025లో చెపాక్ వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి పర్వాలేదన్పించాడు. ఈ మ్యాచ్‌లో కోహ్లి 30 బంతులు ఎదుర్కొన్న విరాట్.. 2 ఫోర్లు, 1 సిక్సర్‌తో 31 పరుగులు చేశాడు. తద్వారా కింగ్ కోహ్లి ఓ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలో చెన్నై సూపర్ కింగ్స్‌పై అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా కోహ్లి నిలిచాడు.

కోహ్లి ఇప్పటివరకు సీఎస్‌కేపై 34 మ్యాచ్‌ల్లో 1068 పరుగులు సాధించాడు. ఇంతకుముందు ఈ రికార్డు టీమిండియా మాజీ కెప్టెన్ శిఖర్ ధావన్ పేరిట ఉండేది. ధావన్ చెన్నైపై 29 మ్యాచ్‌ల్లో 44.04 సగటుతో మొత్తం 1,057 పరుగులు చేశాడు. అందులో ఓ సెంచరీతో పాటు, 8 అర్ధ సెంచరీలు ఉన్నాయి. తాజా మ్యాచ్‌లో 3 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ధావన్ రికార్డును కోహ్లి బ్రేక్ చేశాడు. ఈ అరుదైన ఫీట్ సాధించిన జాబితాలో కోహ్లి, ధావన్ తర్వాతి స్థానాల్లో వరుసగా రోహిత్ శర్మ(896), డేవిడ్ వార్నర్(696), కీరన్ పొలార్డ్(583) ఉన్నారు. ఇక ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ 7 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. ఆర్సీబీ బ్యాటర్లలో రజిత్ పాటిదార్(51) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా.. ఫిల్ సాల్ట్(32), విరాట్ కోహ్లి(31), పడిక్కల్(27) రాణించారు. ఆఖరి ఓవర్‌లో టిమ్ డేవిడ్( 8 బంతుల్లో 1ఫోర్లు, 3 సిక్స్‌లతో 22) మెరుపులు మెరిపించాడు. సీఎస్‌కే బౌలర్లలో నూర్ ఆహ్మద్ మూడు వికెట్లు పడగొట్టగా.. పతిరానా రెండు, ఖాలీల్ అహ్మద్, అశ్విన్ తలా వికెట్ సాధించారు.

# చరిత్ర సృష్టించిన ధోని

## ప్రాణ మిత్రుడి రికార్డు బద్దలు

ఐపీఎల్ 2025లో చెపాక్ వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వేదికగా జరిగిన మ్యాచ్‌లో 50 పరుగుల తేడాతో చెన్నై సూపర్ కింగ్స్ ఓటమి పాలైంది. 197 పరుగుల భారీ లక్ష్యాన్ని సీఎస్‌కే ఛేధించలేక చతికలపడింది. చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి కేవలం 146 పరుగులకే పరిమితమైంది. ఈ మ్యాచ్‌లో సీఎస్‌కే ఓటమి పాలైనప్పటికి .. ఆ జట్టు లెజెండరీ వికెట్ కీపర్ బ్యాటర్ ఎంఎస్ ధోని మాత్రం తన మెరుపు ఇన్నింగ్స్‌తో అభిమానులను అలరించాడు.

తొమ్మిదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన ధోని తనదైన స్టైల్లో షాట్లూ ఆడుతూ స్టేడియాన్ని హోరెత్తించాడు. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఆఖరి ఓవర్ వేసిన కృనాల్ పాండ్యా బౌలింగ్‌లో మిస్టర్ కూల్.. రెండు సిక్స్‌లు, 1 ఫోర్‌తో 16 పరుగులు రాబాట్టాడు. ఓవరాల్‌గా కేవలం 16 బంతులు మాత్రమే ఎదుర్కొన్న ధోని.. 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 30 పరుగులు చేసి ఆజేయంగా నిలిచాడు. ఈ క్రమంలో ధోని ఓ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలో సీఎస్‌కే తరపున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా ధోని రికార్డులకెక్కాడు. ధోని ఇప్పటివరకు సీఎస్‌కే తరపున 236 మ్యాచ్‌లు ఆడి 4693 పరుగులు చేశాడు. ఇంతకుముందు వరకు రికార్డు మిస్టర్ ఐపీఎల్ సురేష్ రైనా పేరిట ఉండేది. రైనా సీఎస్‌కే తరపున 4,687 పరుగులు చేశాడు.

తాజా మ్యాచ్‌లో 19 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద తన మిత్రుడి రికార్డును తలైవా బ్రేక్ చేశాడు. కాగా రైనా చాలా సీజన్ల పాటు సీఎస్‌కేకే ప్రాతినిథ్యం వహించాడు. ధోనికి రైనాకు మంచి అనుబంధం ఉంది. అప్పటిలో అతడిని చిన్న తలా అని అభిమానులు పిలుచుకునే వారు.

**చెలరేగిన ఆర్సీబీ బౌలర్లు..**

ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. సీఎస్‌కే బ్యాటర్లలో రచిన్ రవీంద్ర(41) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆర్సీబీ బౌలర్లలో జోష్ హాజిల్ వుడ్ మూడు వికెట్లు పడగొట్టగా.. యశ్ దయాల్, లివింగ్‌స్టోన్ తలా రెండు వికెట్లు సాధించారు. చెపాక్‌లో సీఎస్‌కేపై ఆర్సీబీ విజయం సాధించడం 2008 సీజన్ తర్వాత ఇదే తొలిసారి. దీంతో సీఎస్‌కే కంచుకోటను పాటిదార్ సారథ్యంలోని ఆర్సీబీ బద్దలు కొట్టింది. 2008 సీజన్ తర్వాత ఏ ఆర్సీబీ కెప్టెన్ కూడా చెపాక్‌లో సీఎస్‌కేపై తన జట్టును గెలిపించకలేకపోయాడు. ఇప్పుడు అది పాటిదార్‌కు సాధ్యమైంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com